విద్యోపకారం

పాలెం విద్యాసంస్థల వజ్రోత్సవాల సందర్భంగా



- గోవిందు గోవర్ధన్

పద్యోపహారం

పాలెం విద్యాసంస్థల వజ్రోత్సవాల సందర్భంగా

28-01-2024

గోవిందు గోవర్ధన్

పద్యోపహారం

పాలెం విద్యాసంస్థల వజ్రోత్సవాల సందర్భంగా

గోవిందు గోవర్ధన్

పాలెము వేంకటేశ్వర ప్రచురణలు : 5

ద్వితీయ ముద్రణ : డిసెంబర్ 2026
ప్రతులు : 500

వెల : అమూల్యం

ప్రతులకు...
గోవిందు గోవర్ధన్
తెలుగు ఉపన్యాసకులు
1-10, పాలెం
నాగర్ కర్నూల్ జిల్లా - 509 215
(ఫోన్: 8106384812)


డి.టి.పి కంది శంకరయ్య, వరంగల్
కవర్ డిజైన్ : గోనెల ఉపేంద్ర, హైదరాబాదు
ముద్రణ : సువర్ణ ప్రింటర్స్, హైదరాబాద్

అభినందన

'విద్యయా వినయం యాతి' అనే సూక్తికి అన్వర్థుడైన గోవిందు గోవర్ధన్ నిరంతర సాహితీ వ్యవసాయైక జీవి. నేను ప్రాచ్యకళాశాలలో అధ్యాపకత్వం నెరపిన సమయాన గోవర్ధన్ సోదర సోదరీ వర్గమంతా క్షీర కంఠస్థాయి నుండి ఎదిగి శ్రద్ధాళువులై విద్యలనభ్యసించి 'విద్యయా అమృతమశ్నుతే' అనేదాన్ని తమయందు నిల్పుకున్నవారై వీరంతా పాఠశాల స్థాయినుండి కళాశాల – విశ్వవిద్యాలయ స్థాయి ప్రౌఢ విద్యాదశ నధిగమించి కీర్తిప్రతిష్టల కాకరమైనారు. ముఖ్యంగా గోవర్ధన్ పాలెం గ్రామాభివృద్ధికి పాటుబడిన తోటపల్లి సోదరులను – వేంకటేశ్వర స్వామిని – మరింకా ఎందరెందరినో తనివిదీరా వర్ణించి – నుతిచేసిన ధన్యుడు. శ్రీ గోవర్ధన్ 'పుణ్యశ్లోకస్య చరితముదాహరణమర్హతి' అనే మహాకవి వాక్కున కనుగుణంగా – తన విద్యాప్రదాతలైన ఎందరెందరో గురువర్యులను (కొందరు చేరలేదు) విస్మరింపక నుతిచేసి ఆచార్యరుణోత్తీర్ణత పొందగలిగినాడని భావిస్తాను. ఇట్టి రచన వర్తమానానికే గాక భవిష్యత్తునకొక రికార్డుగా నిలుస్తుంది. వర్ణనీయులైన వీరిలో అధికులు 'యశఃకాయులే' ఐనా అక్షర చిరంజీవులైనారు.

గోవిందు గోవర్ధన్ అలవోకగా పద్యరచన చేసే కళ అబ్బినవాడు. ఇప్పటికే బహువిధ కృతి నిర్మాతగా పెద్దలనుండి ప్రశంసితుడై – బహుమతులనందిన బహుమతి.

గోవర్ధన్ మరింత గో వర్ధనుడై సాహితీలోక ప్రఖ్యాతుడు కావలెనని ఆశిస్తున్నాను. ఆశీః



డా॥ శ్రీరంగాచార్యులు

హైదరాబాద్

Ph : 9299451266

ఆచార్య దేవో భవ

కం. శ్రీ వేంకటేశు దలచెద
భావింపగ వాని యొడిని పారాడితిమే
గోవర్ధన! నేనును మరి
నీవును, పుణ్యంబు మనదె నిజముగ ధరలో! 1

కం. శ్రీ కపిల వాయి దలచెద
నా కృప నిండారు మామిడన్న దలచెదన్
ఆ కాల మింక వచ్చునె!
నా కన్నుల నీరు నింపు నాటి స్మృతు లయో! 2

కం. చదువుల తల్లికి పాలెము
కుదురగు నొక నాట్యశాల, గురువులుగా తా
నుదయించె నెన్నొ రూపుల
ముదమున సూర్యుండె జ్ఞానము ప్రకాశముగా. 3

కం. సమకాలిక సంఘటనల
క్రమముగ వివరించినావు కమనీయముగా
విమలాత్ముడ! గోవర్ధన!
సము డెవ్వడు నీకు గురుల స్మరణమునందున్. 4

కం. మరువంగ లేవు మే లె
వ్వరు చేసిన వారి ఋణము పద్యములోనన్
సరసముగ తీర్చుకొంటివి
నిరుపమముగ ధన్యమాయె నీ జీవితమే. 5

కం. పెద్దలకు సేవ జేయుచు
నొద్దికగా మసలుకొనుట యొక్కటి చాలున్
నిద్దురపోయెడు వానిని
ముద్దుగ మేల్కొలుప దివ్యములగు గుణములన్. 6

కం. స్మరియించబడిన గురువుల
గురు గుణముల జూచినాడ గురుతున్నవి.. నిన్
దరియింప జేయ నిజముగ
వరియించిన భాగ్యము గద వారల సేవల్. 7

కం. దైవ సమాను లటంచును
భావించితివి గురువులను, భద్ర మిది కదా!
దైవము నిను కరుణించును,
దీవెన లందించు నీకు దినదినమందున్. 8

కం. విందుము "న గురో రధిక"
మ్మందురులే! "గురువు కన్న నధికము లేదే!"
ఇందరు గురువుల బొగడితి
వందరి దీవెనలు నీకు నందినవి సుమా! 9

కం. పద్యము నీకు లభించెను
వాద్యముగా ప్రభుని కొరకు వాయింపవలెన్
చోద్యముగ పూజల న్నిర
వద్యముగా నిహ పరములు వరియించు సుమా! 10

కం. ఈ వజ్రోత్సవ వేళల
నా వజ్రాంగుండు హనుమ యతులిత కరుణన్
దీవించు గాక నిన్ను సు
ధీవర! తన దారి నడచు తీరు తెలుపుచున్. 11

'పరమార్థ కవి'
డా. వెలుదండ సత్యనారాయణ
16.1.24



పాలెం విద్యా సంస్థల వజ్రోత్సవాల నేపథ్యం

పాలెం విద్యాసంస్థల వజ్రోత్సవాలను జరుప తలపెట్టామని పూర్వ విద్యార్థి సమూహంలో వార్త చూచిన మరుక్షణమే నాలో దాగియున్న కవి మేల్కొని నాకు వెన్నంటి నిలిచి, విద్యాసంస్థలను నెలకొల్ప సంకల్పించిన సహృదయులు సుబ్బయ్య గారితో మొదలు విద్యాసంస్థలలో పాఠ్యాంశాలు బోధించిన గురువులు క్రమశిక్షణకు విధించిన కఠినమైన శిక్షలు ప్రతి అంశాన్ని పద్యరూపంలో అందించడానికి ప్రోత్సహించాడు. నిదుర లేచింది మొదలు నిదుర పోయేంత వరకు అనుక్షణం నా దృష్టి పద్యాలు కూర్చడంలోనే నిమగ్నమై ఒక యజ్ఞం మాదిరిగా నా వృత్తిధర్మానికి ఆటంకం కలుగకుండా విద్యార్థులకు న్యాయంచేస్తూనే వజ్రోత్సవాలకు అక్షర యజ్ఞం కొనసాగించాను. నేను వ్రాస్తున్న పద్యాలను చూసిన సమూహంలోని పాలెం పూర్వ విద్యార్థులు ఎందరో పాలెం పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, నన్ను నిరంతరం ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించారు. పాలెం వాస్తవ్యునిగా సుబ్బయ్యగారి ఇంట్లో చాకలి పనిచేసిన మానాన్న చాకలి సాయిలు సుబ్బయ్యగారు నెలకొల్పిన విద్యాసంస్థలలో మా కుటుంబసభ్యులందరిని చదివింప చేయడం వలన మా కుటుంబమంతా ఉద్యోగాలు చేస్తూ సుఖంగా జీవిస్తున్నందుకు సుబ్బయ్య గారికి ఎంతో ఋణపడి ఉన్నాము. ఎన్ని జన్మలెత్తి, ఎంత సేవ జేసినా సుబ్బయ్య గారి ఋణం తీర్చుకోలేము. పాలెం విద్యాసంస్థలలో పనిచేసిన ఉపాధ్యాయ, అధ్యాపకులలో చాలామందికి మా అమ్మ నాన్న సేవలు చేయడం వలన వారి దీవెనలతో పాటు ప్రోత్సాహం పొంది ఈనాడు గౌరవప్రదంగా జీవిస్తున్నాము. శ్రీ రంగాచార్యుల మార్గదర్శనంలో ఏం.ఎ. తెలుగు పూర్తిచేసి, నా పద్య గురువు డా॥ వెలుదండ సత్యనారాయణ గారి శిక్షణలో పద్య రచన నేర్చి, 12 శతకాలు పూర్తి చేయగలిగానని సవినయంగా తెల్పుకుంటున్నాను. నాకు నేర్పిన పద్యరూపంలో ఉడుతా భక్తితో నా శక్తి కొలది పాలెం గ్రామ కారణజన్ములు సుబ్బయ్య గారు, రామేశ్వర శర్మ ఇరువురు రామలక్ష్మణుల మాదిరి నిరుపేదలకు అక్షరభిక్ష బెట్టి దేశవిదేశాలలో తాము నేర్చుకున్న విజ్ఞానాన్ని ప్రపంచమంతటా పంచుతూ పాలెం కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేస్తున్నందకు హృదయం స్పందించి నా శక్తి కొలది

కృతజ్ఞతలు తెలుపుతూ వజ్రోత్సవాలకై సంసిద్ధపరచి సాహితీసహృదయులకు అందించ దలచాను.

నా పద్యరచన చూచి అభినందించిన వారిలో దేశ విదేశాలలో ఉన్న సహృదయులెందరో ఉన్నారు ప్రధానంగా

1. శ్రీ కృష్ణగౌడ్ గారు
2. శ్రీ గిరిజా మనోహరు బాబు గారు
3. శ్రీ పూదత్తు బుచ్చయ్య గారు
4. శ్రీ సోమశిల శారద బాలకిష్టయ్య గారు
5. శ్రీ పోలోజు సత్యం గారు
6. శ్రీ బుడ్డయ్య గారు
7. శ్రీ కాశిరెడ్డి రఘుమారెడ్డి గారు
8. శ్రీ రెడ్డి రెడ్డి రంజిత్ రెడ్డి గారు
9. శ్రీ బాలకిష్టయ్య గారు
10. శ్రీ కుంబారతి మోహన్ బాబు గారు
11. శ్రీ వీరాంజనేయులు గారు
12. శ్రీ ఏడుదొడ్ల మల్లికార్జున్ రెడ్డి గారు
13. శ్రీ సొప్పరి కాశన్న

ఇలా ప్రతి యొక్కరు ప్రతిరోజు నేను వ్రాసిన పద్యం చూసిన వెంబడే సంతోషంతో ఉప్పొంగి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వీరందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ దీన్ని వజ్రోత్సవాలలో ఆవిష్కరింప జేసి ప్రతి పూర్వ విద్యార్థికి అందించాలని సంకల్పించాను. ప్రోత్సహించిన పూర్వ విద్యార్థులందరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

నేను నాదృష్టికి వచ్చిన అంశాలను పద్యాలుగా కూర్చినవాటిని పరిశీలించి, తప్పొప్పులను సరిదిద్ది, ఒక క్రమపద్ధతిలో అమర్చిన 'సమస్యా పృచ్ఛక చక్రవర్తి' శ్రీ కంది శంకరయ్య గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను

పాలెం విద్యాసంస్థల పూర్వ విద్యార్థి

గోవిందు గోవర్ధన్

పాలెం విద్యాసంస్థలు


వెనుకబడిన పాలమూరు జిల్లా ప్రజల అభ్యున్నతికై నిరంతర కృషిచేసిన మహానుభావుడు పాలెం సుబ్బయ్యగారు. 1958 నాటికి సామాజిక సేవ చేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. దారిద్ర్య రేఖకు దిగువన నున్నవారితో ఆయన సన్నిహితంగా మెలిగేవారు.

1961 వరకు పాలెంలో 5 వ తరగతి వరకు ఏకోపాధ్యాయ ప్రభుత్వ పాఠశాల ఉండేది. పైచదువులకు బయటకు వెళ్ళాల్సి వచ్చేది. పాలెంలో హైస్కూలు ప్రారంభించాలని సంకల్పించి 'ఆదర్శ విద్యాసమితి'ని స్థాపించి చదువుకోడానికి వచ్చిన విద్యార్థులందరిని చేర్చుకునేవారు. వారికి ఉచిత భోజన, వసతిని కల్పించారు. వెనుకబడిన విద్యార్థులందరి కొరకై 1962 లో కళాశాలను స్థాపించారు. 1963 లో PUC లో 80% ఉత్తీర్ణత సాధించగా అందులో 30% మెడిసిన్ ,20% ఇంజనీరింగుకు ఎన్నికైనారు. తద్వారా ఇతర జిల్లాలనుండి విద్యార్థులు రావడం మొదలైంది. తల్లిదండ్రుల స్థితిగతులను పరిశీలించి నిరపేద విద్యార్థులకు అవకాశం కల్పించేవారు. 1964 లో B.Sc, తెలుగు పండితుల కొరకై ఓరియంటల్ కళాశాలను నెలకొల్పారు. ఉదయం సైన్స్ కోర్సులు, సాయంత్రం ఓరియంటల్ కోర్సులు కొనసాగినవి. పాఠశాల విద్యార్థులతో పాటు రెండు కళాశాలల విద్యార్థులకు కూడా ఉచిత భోజన, వసతులు కల్పించడమైనది.

1954 లో 5వ తరగతి వరకు ఉన్న పాలెం 1967 నాటికి డిగ్రీ కళాశాల స్థాయికి చేరింది. 1-06-1963 నుండి 13-03-1981 వరకు నడిపించి విద్యాసంస్థలను 14-03-1981 లో ప్రభుత్వపరం చేసినారు. ఈ విద్యాసంస్థల పూర్వ విద్యార్థులందరూ కలిసి సిల్వర్ జూబ్లి, గోల్డెన్ జూబ్లి ఉత్సవాలు ఘనంగా జరిపినారు. 28-01-2024 నాడు దేశవిదేశాలలో ఉన్న పూర్వ విద్యార్థులందరూ కలిసి పాలెం కళాశాలలో వజ్రోత్సవాలు జరుప నిశ్చయించారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కృతజ్ఞతతో నావంతుగా నేను నేర్చిన పద్యవిద్యలో పాలెం ప్రాథమిక పాఠశాల నుండి రెండు కళాశాలలలో 1963 నుండి 1995 వరకు బోధించిన గురువులందరి బోధనల గురించి పూర్వ విద్యార్థులు చెప్పగా విని, ప్రైమరీస్కూల్ నుండి డిగ్రీ వరకు నాకు బోధించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులందరి బోధనను నెమరువేసుకుంటూ ఉడుతాభక్తిగా పద్యరూపంలో వారిని ప్రశంసిస్తూ వజ్రోత్సవాలలో పూర్వ విద్యార్థులందరికి అందించ దలిచి సంసిద్ధపరిచాను.


కృతికర్త
జి. గోవర్ధన్
తెలుగుఉపన్యాసకులు
ఎం.వి.ఎస్. ప్రభుత్వడిగ్రీకళాశాల
మహబూబ్ నగర్
చరవాణి : 8106384812



ప్రశంసాపద్యము

మ. చదువుల్ నేర్పిన సద్గురూత్తముల వాత్సల్యమ్ము వాక్రుచ్చి యా
చదువుల్ నేర్వఁగ మూలమౌ బడి కళాశాలల్ ప్రశస్తంబుగా
మదిలో వెల్గఁగ మేటి పాలెమును సంభావించుచున్ వ్రాయఁగాఁ
గొదవేమున్నది నీ కవిత్వమునకున్ గోవిందు గోవర్ధనా!

'సమస్యా పృచ్ఛక చక్రవర్తి, పద్యవశంకర'
కంది శంకరయ్య
వరంగల్



పద్యోపహారం

పాలెం విద్యాసంస్థల వజ్రోత్సవాల సందర్భంగా

శ్రీ పాలెము వేంకటపతి
కాపాడుచు వృద్ధి సేయగా దినదినమున్
దీపించిన విద్యాలయ
రూపమ్ముల నాదు కవితలో వివరింతున్. 1

కం. వరదుడు నా వెన్నంటుచు
గురుమూర్తుల బోధనలను కొసరున మదిలో
స్ఫురణకు నందించగనే
మరువక కూర్చితిని కంద మాలగ నిపుడున్. 2

పాలెం శ్రీవేంకటేశ్వరుని వైభవం

ఉ. శ్రీవరదాయకుండవని చిన్మయరూప కృపాసుధాంబుధీ!
దేవరపాదపద్మములు దిక్కని నమ్మిరి విశ్వనాథ! మీ
కోవెల నిల్పి శిల్పమును కొల్వగ జేసిరి సుబ్బయార్యులున్
కావగ రమ్మి భక్తులను కాంచుము పాలెము వేంకటేశ్వరా! 3

ఉ. అన్నము లేనివారలకు నండగ నిల్చుచు నాదరంబుతో
చిన్నగ దారి చూపుచును చింతలనెల్లను రూపుమాపుచున్
పెన్నిధియైన విద్యలను ప్రేమగ నేర్పుచు కొల్వులుంచగా
నెన్నడు కర్వు కాటకము లెర్గరు పాలెము వేంకటేశ్వరా! 4

సీ. గతమునం దొకనాడు గంతులు వేయుచు
చిరుతగం డిచటకు చేరుకొనెను
భీతిల్లి జనులెల్ల పెనుకేకలేయుచు
నెదిరింప శీఘ్రమే యేకమైరి
డప్పు తుపాకుల ధమధమ శబ్దాలు
చేయుచుతరుమగా చెంగునెగిరి
గాండ్రింపు వినిపించి గడగడ లాడించి
కనుమరుగైపోయె కనులముందు
తే.గీ. తనదు యునికి నెరింగింప దైవమిటకు
చిరుత రూపుతో నగుపింప చేరె ననుచు
పలికిరానాటి వృద్ధులు పల్లెయందు
వింటి చెపులార పాలెము వేంకటేశ! 5

ఉ. తిర్మలకొండపైకి చను దేవుని భక్తుల రద్ది తీవ్రమై
నిర్మలమానసంబుడుగు నిశ్చలభక్తుల కోర్కెమేరకున్
ధర్మము పాదుగొల్పుటకు తక్షణమే నెలకొంటివంచు నీ
మర్మము తెల్పిరెల్లరకు మౌనులు పాలెము వేంకటేశ్వరా! 6

ఉ. దారిని నేగు రైతు తన ధాన్యపు రాసులనమ్మడానికై
కోరుచు గిట్టుబాటు ధర కోసము ముద్పులు గట్టి యేగ వ్యా
పారము చేయువారి యెద పాటిగ మార్చుచు జాలి నింపగా
భారిగ పల్కిరంట ధర వానికి పాలెము వేంకటేశ్వరా! 7

ఉ. కద్పులు పండనట్టి ప్రజకంటను నీరిడి తోచి నీగుడిన్
ముద్పులు కట్టి యేగ గను మోదముతోడను వత్సరాంతమున్
తోడ్పడి ముద్దుపాపలకు తొట్టెలు కట్టగ జేసినావయా!
యేడ్పులు మానిరంట యిటనెల్లరు పాలెము వేంకటేశ్వరా! 8

ఉ. కన్యలు బ్రహ్మచారులకు కాక వివాహము దీర్ఘకాలమున్
దైన్యతనొంది చేరిరిట దారిని చూపితివంట వారికే
అన్యుల నమ్మియుండి తుద నండవు నీవని నమ్మువారి నీ
వన్యులుగా దలంపవని యందురు పాలెము వేంకటేశ్వరా! 9

ఉ. ధారణచక్రవర్తులకు దక్కెను గౌరవ మెంతయో యిటన్
మేరలు దాటి వచ్చి తమ మేధను చాటిరి దేశమంతటన్
ధీరుల పద్యధారణలు తృప్తిని కూర్చె హృదంతరాళమున్
చేరిరి సాహితీప్రియులు శీఘ్రమె పాలెము వేంకటేశ్వరా! 10

ఉ. నిత్యము దేశనాయకుల నిల్పితివిచ్చట నెల్లవేళలన్
భృత్యులునయ్యిరయ్య నిను పెన్నిధి వంచును పాదసేవకై
మృత్యువు నందుదాక నిట మేటిగ పూజలు సల్పిరెందరో
సత్యము సాక్షిరూప! కన సాగిరి పాలెము వేంకటేశ్వరా! 11

ఉ. మూగకు మాటలిచ్చితివి మ్రొక్కిన శ్రీపురపద్మశాలికిన్
రోగులు భూతపీడితులు రోదన చేయుచు నిన్ను చేరగా
వేగమె తొల్గజేసితివి వింతగ నిత్యము భక్తసంద్రమై
మూగిరి దర్శనంబునకు ముద్దుగ పాలెము వేంకటేశ్వరా! 12

ఉ. నవ్వుల పువ్వులొల్కి చిరు నాట్యము చేయగ నీదు మోముపై
దవ్వులనుండి వచ్చి నిను దర్శనమందిన భక్తకోటికిన్
దివ్యమనోహరమ్మునయి తృప్తిగ కంటికి భ్రాంతి కూర్చుచున్
నవ్యపు రూపుదాల్చునని సమ్మిరి పాలెము వేంకటేశ్వరా! 13

పాలెంలో అద్భుత సూర్యగ్రహణం

ఉ. సూర్యుని మ్రింగ బూని యరి శూన్యములో పరికించునట్టి యా
కార్యముతోడ దాగ నిట క్రమపు తావని చేరి యుండగా
నార్యుల శోధనంబునను నద్భుతదృశ్యము దూరదర్శినిన్
చర్యలు బూని యెల్లరకు చాటిరి పాలెము వేంకటేశ్వరా! 15

ఉ. ఏమని చెప్పుదయ్య జనులెల్లరు మెచ్చగ నిందిరమ్మయే
క్షేమము కోరి నెమ్మదిగ జేరెను నీగుడి దూరమెంచకే
యామెకు కోర్కె దీరగను సద్భుతమందగ గద్దె నిల్పుచున్
నీ మహిమెంతొ చూపితివి నిక్కము పాలెము వేంకటేశ్వరా! 16

ఉ. పల్లెలు పట్టణంబులును బారులు కట్టెను మెల్లమెల్లగా
నెల్లలు తాకి భక్తులిట కిష్టముతోడను నేగుదెంచగా
నెల్లరు పిల్లపాపలును నింపుగ చేరిరి యెడ్లబండ్లపై
నల్లనిమూర్తి నిన్ను మది నమ్మిరి పాలెము వేంకటేశ్వరా! 17

ఉ. పావనమైననేల యని భారతభూమి యతీంద్రులెందరో
భావనచేసి వచ్చిరిట పాదము మోపిరి తృప్తి చెందుచున్
దీవెనలిచ్చి భక్తులకు దిక్కులకంతట కీర్తిచాట నీ
కోవెల దర్శనంబు కన కోరిరి పాలెము వేంకటేశ్వరా! 18

పాలెం జాతరకు భక్తుల వరద

ఉ. పాలెము వేంకటేశ్వరుడు భక్తుల పాలిటి కల్పవృక్షమై
మేలును కూర్చుచుండ కని మెచ్చి నుతించుచు నెల్లదిక్కులన్
వీలును బట్టి పిల్లలును పెద్దలు వృద్ధులు నెల్లవారలున్
వేలకు వేలు చేరుదురు వేడ్కలు చూడను జాతరందిటన్. 19

పాలెం దేవాలయములో రథసప్తమి ఉత్సవాలు

సీ. అమరలోకాధిపు డానందనిలయుడు
నరుదెంచె భువిపైకి నాదరించి
స్వర్ణకాంతులనీనె సప్తాశ్వరథముపై
నూరేగ జేయను నున్నతముగ
పాలెము గ్రామాన భక్తులెల్లరు కూడి
స్వాగతించగ మెచ్చి సరిగ నిలిచి
దేవేరులను కూడి తృప్తి నాసీనుడై
విహరించు చుండగా వీధులందు

తే.గీ. సుదతులెందరో యెదురేగి ముదముతోడ
నంద జేసిరి మంగళ హారతులను
రచ్చబండకేతెంచె తా నిచ్చగించె
నభయమందించె దరిచేర్చి శుభము కలుగ. 20

హనుమద్వాహనము

సీ. ధర్మస్వ రూపుడు నిర్మల హృదయుడు
దశరథ తనయుడు దానవారి
దాసుడై నిరతము దండప్రణామాల
కొనసాగుచుండును కోర్కెమీర
ముకుళత హస్తా ల ముదమొప్పగను పాద
పద్మాలచెంతను ప్రాకటముగ
రోమరోమమునందు రామనామమువిన
శ్రద్ధాళువైయుండు సాధుశీలి
తే.గీ. బ్రహ్మచారిగాఘనకీర్తిపడసినట్టి
వాయుతనయుడునరుదెంచి వందనమిడి
భుజమునే పీఠముగ జేసి పొందికగను
దాసుడైకొనసాగెనుధరణియందు. 21

గరుడ వాహనము

సీ. లోకరక్షకుడైనవైకుంఠ వాసుడు
దేవేరులను కూడి దిగెను భువికి
భక్తులాశించిన భవబంధములుద్రుంచి
ముక్తి ప్రసాదించి మోదమలర
వరములనందించి పరవశమొందించి
యండదండగనుండ యడుగులేయ
చక్కని రెక్కల నొక్కసారిగ విప్పి
జుమ్మను నాదాన జోరుగాను

తే.గీ. స్వామి చెంతకునేతెంచి సంతసమున
వందనమ్మిడి నిలిచిన వైనతేయు
నాదరమ్మునాసీనుడై హాయిగాను
పయనమయ్యెను విహరింప వరదుడిలను. 22

గజవాహనము

సీ. గర్వాంధకారాన కరిసంఘమును కూడి
విహరించి యంతట విర్రవీగి
కాసారమును చేరి గంతుల వేయుచు
నతలాకుతలమైన నదురకుండ
కలత చెంది మకరి గాఢనిద్రను వీడి
బంధించె తననోట పట్టుబట్టి
ధీరత్వమును కల్గి తెగువతో పోరాడి
సన్నగిల్లుచుశక్తి చతికిలబడె
తే.గీ. రక్తమోడుచు తన ప్రాణ రక్ష కొరకు
విన్నవించగ శ్రీహరి వేగముగను
క్రూరజంతువు తలద్రుంచి కూల్చివేయ
వాహనమ్మయ్యెనాదంతి వరదునకిట. 23

హంసవాహనము

సీ. సర్వలోకారాధ్య సారసాక్షుడు నేడు
లోకకళ్యాణమై ప్రాకటముగ
విశ్వాంతరాళాన విహరించడానికై
యోచించుచుండగా నొనరుగాను
వయ్యారమొలుకుచు వసుధను చుట్టేయ
సంసిద్ధమై యున్న హంస పైన
శ్రీమతు లిరువైపు సిగ్గులొలుకుచుండ
నాసీనుడైయుండె నద్భుతముగ

తే.గీ. చక్కనైనట్టి రెక్కల నొక్కసారి
విప్పిముందుకుసాగుచు వింతగాను
చేరె పాలెము గ్రామము నేరుగాను
వరములందించి భక్తుల మురువజేసె. 24

అశ్వవాహనము

సీ. అఖిలాండ కోటిబ్రహ్మాండనాయకుడైన
శ్రీవేంకటేశుడు చిత్తగించి
దేవేరులను కూడి దిగ్దిగంతాలను
తృప్తిగా వీక్షింప దిగెను భువికి
ప్రవిమలచరితుడు భక్తమందారుడై
యద్భుతలీలల నడుగులిడుచు
నందదండలతోడ నభయ మందించుచు
పాలె మేతెంచెను వలపుతోడ
తే.గీ. నశ్వవాహనారూఢుడై యాదరమున
వరములను జల్లులంతట కురియజేసె
కన నిమీలితనేత్రులై కరములోడ్చి
భక్తి పారవశ్యముతోడ ప్రణతులిడిరి. 25

శేషవాహనము

సీ. బ్రహ్మోత్సవాలలో భక్తుల దరిచేరి
మొరలాలకించుచు ముచ్చటించి
యలసియుండుననుచు నాదిశేషుడెరిగి
సేవ జేయగ నెంచి చెంత నిలిచి
పాన్పుగా మారుచు పవలింపుమని వేడె
బడలిక తీరను నడుగు లేసె
బ్రాహ్మణోత్తము లెల్ల భక్తితో నుడివిన
వేదమంత్రంబులు విందుగొలిపె

తే.గీ. శ్రీమతులు నిద్దరును కూడ శ్రీకరముగ
పాదముల నొత్తుచుండగా పరవశించి
హాయిగా సేదదీరుచు నమరవిభుడు
సకలలోకాలపై దృష్టి సారజేసె. 26

గుడిచుట్టూ భక్తుల సందడి

సీ. పల్లె పట్టణముల భక్తులెల్లరు కూడి
వాహనమ్ములపైన వరదలైరి
క్రిక్కిరియగ వచ్చి కేల్మోడ్చుటకునైన
తహతహలాడిరి దర్శనమున
పిల్లలు మరి వృద్ధు లెల్లవారలిచట
గోవింద యనుచును గొంతులెత్తి
పారవశ్యముతోడ పలుకుచుండగ నొడ
లటునిటు కదలాడె నదురు నటుల
తే.గీ. భక్త సంద్రమై కనిపించె పరిసరములు
నిండుకొనియున్నవంతట నిక్కముగను
వేదమంత్రాలు వీనుల విందు గొలిపి
కనులపండుగై తోచెను కడ వరకును. 27

తేరు కదిలే సమయములో గుడిముందు భక్తుల కిటకిట

సీ. జుమ్మను నాదాల జోరీగలీదను
చోటులేకున్నది చూడనిచట
దారినిండుగ జనుల్ తనువులు రాపిడై
యబ్బ! యమ్మా! యని రడుగులిడుచు
చంటి పిల్లలనెల్ల చంకలోనిడుకొని
దిక్కులన్నిటివైపు నక్కిచూచి
బిత్తరి చూపులు చిత్తానుసారము
ప్రసరింపచేసిరి పలువిధముల

తే.గీ. రయ్యిన తిరుగు రంగుల రాట్నములను
రెప్పవాల్చక తిలకించి తప్పకుండ
జనకులను వేడి రెక్కింప మనసు నిలిపి
కాదు లేదన నటనుండి కదలకుండ. 28

స్వామి రథోత్సవాన్ని ఆకాశం నుండి తిలకిస్తున్న రేరాజు చంద్రుడు

సీ. కలియుగ దైవము కరుణాసముద్రుని
బ్రహ్మోత్సవాలకై పాలెమునకు
భక్తులెల్లరు కూడి బహు దూరముల నుండి
. బారులు కట్టిరి భారమనక
స్వామి రథోత్సవ సన్నాహమున చంద్రు
డాకాశదీపమై యద్భుతముగ
వెలుగుల జిమ్ముచు వీక్షించెనటనుండి
తన్మయత్వము నొందె తనివితీర
తే.గీ. యువకులెందరో యిరువైపు లొప్పుచుండి
యినుప గొలుసులు చేబూని రేక మగుచు
పలికి గోవింద నామాలు భక్తితోడ
లక్ష్యమును జేర రథమును లాగిరిచట. 29

ఉద్దాలు :- (దేవునికి పాదరక్షలు)

సీ. దీన రక్షకుడైన దేవదేవుని పాద
పద్మాలకుద్దాలు భక్తితోడ
దళితబంధువులిట దండప్రణామాల
సంసిద్ధపరిచి సత్సంఘముగను
డప్పు టపాసుల ధమధమ శబ్దాల
ముదమొప్పగను మారు మ్రోగజేసి
రూరేగుచును పాత యూరునుండడుగిడి
రరుదెంచుచుండగ వెరపు లేక

తే.గీ. చేరి శివసత్తులెందరో చెంగునెగిరి
దైవనామము నెలుగెత్తి దండమిడుచు
దారిపొడవు నాటాడుచు తరలివచ్చి
పాదముల చెంత నుంచిరి ప్రస్తుతించి. 30

పాలెం వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలను పద్యరూపంలో సచిత్రముగా అందింప నెంచుట

సీ. పాలెముపురవాస భక్తసులభుడైన
వేంకటేశుని గూర్చి వింతగాను
బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతోడ
తిలకించినవి యన్ని దినము దినము
నాద్యంతమును కూడ పద్యాల సుమములై
వికసించెను మదిని విరివిగాను
చింతను వీడి సచిత్రమ్ముగను కూర్చి
యందించదలచితి నందరకును
తే.గీ. సంతసమున సహృదయులు చదువుచుండ
తలుకులీనును జ్ఞాపకాల్ విలసితముగ
మురియుచుందురు తప్పక ముచ్చటించి
సరిగ నింటిల్లిపాదులు స్వాగతింప. 31

పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ శ్రీ జున్న శేఖర రెడ్డిగారి సేవల గురించి

సీ. శ్రీవేంకటేశుడు చిత్తమందున నిల్చి
యాహ్వాన మందించె నాదరించి
పాలక మండలి బాధ్యతల్ చేపట్టి
గతవైభవమునకై ప్రతిన బూనె
నరుదెంచు భక్తుల కన్ని సౌకర్యాల
నన్న ప్రసాదాల నంద జేసె
నిర్మల హృదయుని నిస్వార్థ సేవల
నెరిగిన ఘనదాత లెల్లరిపుడు

తే.గీ. జున్న శేఖర రెడ్డ్యాఖ్య శుభకరుండు
దివ్యమంగళరూపుని దేవళమును
తీర్చిదిద్దునటంచును దిగులులేక
ధనము నందించుచున్నారు దండిగాను. 32

చం. వరదుని మందిరమ్ము గతవైభవమొప్పగ తీర్చిదిద్దగా
నరసిరి జున్న శేఖరుని నందరుమెచ్చుచు సాదరంబుతో
పరువుగ నిల్పి రిష్టముగ పాలన బాధ్యలప్పజెప్పగా
మురువగ జేసె నెల్లరను ముద్దుగ మండలి యండదండలన్. 33

ఉ. స్నానము సంధ్య వార్చుటకు శాశ్వత నీటి కుళాయి లన్నిటన్
ఉన్నతమైన పాన్పులిక నుల్లము దోచెడి గాలిపంఖలన్
ఎన్నడు కానకుండిరివి యింతకు పూర్వము భక్తులిచ్చటన్
చిన్నలు పెద్దలెల్లరును చేరి తరించుటకన్నివేళలన్. 34

కం. జున్నాఖ్యాంబుధిచంద్రా!
చిన్నలు పెద్దలును మెచ్చి జేజే లనగా
నన్నిటి నభివృద్ధి పరచి
మన్ననలే పొందితీవు మహనీయ గుణా! 35

చం. వరములనిచ్చువాడు మన వాయుతనూజుని పాదపద్మముల్
స్థిరముగ దల్చు వారలకు చెంతను చేరుచు కార్యసిద్ధులన్
విరివిగ నందజేయునని విజ్ఞులు దెల్పిరి విశ్వసించినే
మరువక జీవితాంతమును మచ్చికతోడను సాగుచుందిలన్ 36

పాలెం విద్యాసంస్థల వజ్రోత్సవాల సంకల్పమును పురస్కరించుకుని

కం. వినజేసిరి శుభవార్తను
ఘనముగ వజ్రోత్సవములు గగనముతాకన్
కని విని యెరుగని రీతిగ
మనసారగ నిర్వహింప మన పాలెమునన్. 37



స్వర్గీయ శ్రీ తోటపల్లి (సుబ్రహ్మణ్యం) సుబ్బయ్య గారు

సుబ్బయ్యగారి సత్సంకల్పము

కం. ధరణీసురుడీపురమున
వరదుడు సంతృప్తినొంద బడి గుడులిచటన్
మురిపెముతో నెలకొల్పెను
స్థిరముగ దీనులను తీర్చి దిద్దుటకొరకై. 38

విద్యాలయాలు, భోజన వసతిసౌకర్యాలు కల్పించడం

కం. జనులందరి సంక్షేమము
మనసున కదలాడుచుండ మచ్చికతోడన్
వినజేసెను చదువుడనుచు
ధనమును వెచ్చించి వారి దైన్యత మాన్పన్. 39

బ్రతుకు బాట చూపించుట

కం. చైతన్యమునందించుచు
ప్రీతిగ దరిచేర్చెను నిరు పేదలనిచటన్
రీతిగ బ్రతుకుడటంచును
నీతిని బోధింపజేసి నిలిపెను జగతిన్. 40

సుబ్బయ్యగారి సహృదయత

కం. తనవారనుకొని ప్రజలకు
తన ధన ప్రాణముల నొసగి దాతృత్త్వమునన్
వెనుదిరుగక యేనాడును
మనుగడ సాగింపజేసె మరణముదాకన్. 41

సుబ్బయ్యగారు నిరుపేదలకందించిన విద్యాధనం

కం. నిరుపేదలనెందరినో
వెరువకుడని దరికి జేర్చి విద్యాధనమున్
నిరుపముగా నందించుచు
దరహాసమ్మొలుక బ్రతుక తరలగ జేసెన్. 42

న భూతో... న భవిష్యతి

కం. జనులందీ సద్గుణముల
మనుజుని కనలేదు మహిని మహితాత్మకులున్
వినజేయగలేదెవ్వరు
మునుపటి కాలమ్మునందు ముచ్చట దీరన్. 43

జాతిరత్నాలుగా వెలుగొంద జేయుట

కం. క్రమముగ సానల బట్టుచు
రమణీయముగాను జాతి రత్నములెన్నో
ప్రముఖులు గురుమూర్తులతో
మమకారముతోడ తీర్చి మహిలో నిలిపెన్. 44

భాగీరథమ్మ, సత్యమూర్తి గారల నోముపంట

కం. తిరుమల వాసుడు పాలెము
పురమున జన్మించ దలచి పూజ్యాధికులౌ
తరుణీమణి భాగీరథి
మొర వినగానెంచి సత్యమూర్తియు మెచ్చన్. 45

గౌరవప్రదమైన జీవితమందించుట

కం. ధరణీసురు డిట నిలిపిన
వరవిద్యా సంస్థలందు వైభవ మొప్పన్
గురువుల బోధన మనలను
స్థిరముగకొల్వులను జేయ చింతలు బాపెన్. 46

విశాలమైన హృదయం

కం. ఊరూరను నిరుపేదల
కోరికతో చదువజేయ కుదురుగ పాలెమ్
చేరుటకై తెలిపెను భూ
సురుడగు మన తోటపల్లి సుబ్బయ గారే. 47

ఉన్నతంగా తీర్చి దిద్దుట

కం. అక్షరమెరుగని వారల
పక్షము తానై నిలువగ బడిచదువులకై
యక్షయముగ చేరిన గురు
శిక్షణతో తీర్చిదిద్దె శిల్పమ్ములుగన్. 48

సుబ్బయ్యగారి దార్శనికత

కం. ఉన్నతమగు బడి గుడులిట
చిన్నలు పెద్దలును చదువ చేరిన వసతిన్
అన్నము కొరతయు లేకను
మిన్నగ నెలకొల్పె నాడు మేలొనరించెన్. 49

తోటపల్లి సోదర ద్వయానికి కృతజ్ఞతలు

సీ. పల్లె పాలెము దేశమెల్లలన్ దాటుచు
వెలుగొందుచున్నది విశ్వమంత
వివిధ రంగములందు విజ్ఞాన కోవిదుల్
సేవలందించుచు శ్రీకరముగ

సుశ్లోకుడైనట్టి సుబ్బయ్య యాశయాల్
నెరవేర్చుచున్నారు మరువకెపుడు
ధృవతారగా నిల్చి దివ్యకాంతిని వెద
జల్లుచు నిత్యము సజ్జనుండు
తే.గీ. కాంచి చిరునవ్వు చిందించె ఘన యశుండు
ఆశయమ్మును సాధింప నడుగులేసి
చంద్రునికి నూలు పోగుగా శతకములను
కూర్చి యందించుచున్నాను కోర్కెమీర. 50

పాలెం గ్రామాభివృద్ధికై సుబ్బయ్యగారికి సహకరించిన పాలెం రెడ్రెడ్డి దొరలు, మనుసాని సోదరులు

సీ. నిర్మలహృదయులు ధర్మాత్ము లైనట్టి
రెడ్డ్రెడ్డి వంశజుల్ దొడ్డదొరలు
సుశ్లోకుడైనట్టి సుబ్బయార్యునికిట
గుడి బడికై భూమి కొరతలేక
మనుసాని వంశజు లనుజన్ము లిరువురు
ధనమునందించిరి మనసునిలిపి
బీదసాదలనెల్ల ప్రేమామృతముపంచి
చదువు సంధ్యలు నేర్పి సంస్కరింప
తే.గీ. సంస్థలనునెలకొల్పెనుశ్రద్ధబూని
తీర్చి విజ్ఞులన్ దేశవిదేశములకు
సేవజేయపంపించెను శ్రీకరముగ
పూజలొందుచున్నరుభువి పూజ్యులెపుడు. 51

పాలెం భూసురుల నిస్వార్థ సేవలు

కం. అక్షరబిక్షను పెట్టుచు
లక్షణముగ నెదుగుడనుచు లక్ష్యము కొరకై
వీక్షించిన భూసురులను
దీక్షగ వెదుకంగ గలమె దివి భువి నెల్లన్. 52

రెండు కళాశాలలో ఆనాటి తెలుగు అధ్యాపకులందరిని స్మరిస్తూ

కం. ఆంధ్రము సంస్కృతమను ఘన
సంద్రమ్మవలీలనీదు సద్గురుమూర్తుల్
చంద్రులునై జ్ఞానము దే
వేంద్రులునేతెంచిరిచట వెలుగులు చిమ్మన్. 53

నిరంతరము జరిగిన సభలు సమావేశాలను నెమరువేస్తూ

కం. కలకలలాడుచు పాలెము
గలగలమనుచుండె నిండు గంగానదిగా
పలువురు చిన్నలు పెద్దలు
తలపున మెదలంగ నిటకు తరలుచు నుండన్. 54

పాలెంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం ప్రధానాచార్యులు డా|| పి. మల్లికార్జున్ గారి సారథ్యంలో

సీ. పల్లెపాలెము కీర్తి నెల్లలు దాటగ
చాటి చెప్పగనెంచి శ్రద్ధతోడ
సిబ్బంది యెల్లరు చేయూతనందింప
నిర్వహింపదలచి నేర్పుగాను
కవి గాయకుల యెదల్ కదిలింప చేయుచు
నాహ్వానమందించె నందరకును
వడివడి నడకల నడుగిడి రెందరో
దూరభారమునైన త్రోసివేసి
యద్భుతంబుగ కైత లాలపనము జేసి
పరవశింపగ జేయ వరుసగాను
తే.గీ. హృదయ పద్మముల్ వికసించి తృప్తిగాను
మోకరిల్లెను వెంకన్న శ్రీకరమగు
పాద పద్మాలపై వ్రాలె ప్రాకటముగ
మల్లికార్జునాఖ్యా! మిమ్ము మరువగలమె? 55

పాలెం ఓరియంటల్ కళాశాలను నిలుపుట కొరకై ఉన్నతవిద్యాశాఖాధిపతులు కమీషనర్ శ్రీ బుర్రా వేంకటేశ్వం IAS గారు, డా|| జి. యాదగిరి గారికి, డా|| డి.ఎస్.ఆర్. రాజేంద్ర సింగ్ గారికి, డా|| పి. బాలభాస్కర్ గారికి, డా|| దాశరథుల తిరువెంగళాచారి గారికి పేరుపేరున విజ్ఞప్తి

సీ. పల్లెపాలెమునందు ప్రాచ్యకళాశాల
ప్రాభవంబెరుగుదు ప్రముఖులార
ఉమ్మడి రాష్ట్రమం దౌన్నత్యముగ నాడు
నిరుపేదలను చేర్చి నేర్పుగాను
అవిరళ కృషిసల్పి కవిపండితుల జేసి
తీర్చిదిద్దిరిచట దేవగురులు
దేశవిదేశాల దిగ్దిగంతాలకు
కీర్తిపతాకము పూర్తిగాను
రేయింబవల్లును రెపరెపలాడుచు
వెలుగొందుచుండెను విశ్వమంత
ఉన్నతవిద్యయం దౌన్నత్యశాఖలో
విధులయందున్నట్టి విజ్ఞులార!
విబుధేశ్వరా! బుర్ర వేంకటేశము గారు
ఆలకించుడు విన్నపాలు మావి
యాదగిరార్య! మమ్మాదరించుడు దయన్
శ్రీకరా రాజేంద్ర సింగువర్య!
తే.గీ. భవ్యగుణసాంద్ర మా బాల భాస్కరుండ!
దాశరథుల వంశోద్భవ! ధరణిసురుడ!
దేవ! తిరువెంగళాచార్య! దీనరక్ష!
అండదండల నందించు డార్యులార! 56

పాలెం విద్యాక్షేత్రాల ఫల వృక్ష సంపద

కం. హృదయక్షేత్రములందున
చదునొనరగ జేసి రైతు సద్గురు మూర్తుల్
పదునగు బీజాక్షరములు
వెదజల్లుచు పెంచిరి ఫల వృక్షమ్ములకై. 57

కలుపుమొక్కలను తొలగించుట

కం. అనుదినమరయుచు మొలకల
మనసారగ పెంపుజేయ మదిలోతులలోన్
కనుగొని సూక్ష్మపు దృష్టిని
పెనవేసిన కలుపునెల్ల పెకలించగనే. 58

చీడపీడలను నివారించుట

కం. చీడలు పీడలు వీడుచు
చూడను చిగురాకులేసి చోద్యమ్ముగనే
యోడక నెదురును లేకను
వేడుక కలిగించుచుండె వీక్షణములకున్. 59

వజ్రోత్సవాలను పురస్కరించుకుని

సీ. సద్గురు మూర్తులై సకల శాస్త్రములలో
సారము రాబట్టి శ్రద్ధతోడ
నింపుగా విద్యార్థు లెల్లర కెరిగింప
నధ్యయనము జేసి హాయిగాను
ఉన్నతఫలితమ్ము లొనరుగా సాధించి
ఘనకీర్తి చాటిరి గగనమంత
విజ్ఞానమును పంచ విశ్వ వ్యాప్తమైరి
పల్లెను వీడి ప్రపంచమంత

తే.గీ. నేడు నెలకొని యున్నారు నిండుగాను
దివ్యకాంతులందుచునుండ దిక్కులంత
సంభ్రమాశ్చర్యముల నొంద సకల జనులు
జరుప వజ్రోత్సవాలు సత్సంఘమైరి 60

గౌ|| మోహన్ బాబు, బాలకిష్టయ్యల ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలుపుతూ

కం. సాహితి సహృదయులు మన
మోహనబాబాఖ్యుదరసి ముదమొందుచు నా
సాహసకృత్యమ్మనిరే
యాహా! యని బాలకృష్ణులార్యులునెల్లన్. 61

పాలెం విద్యా సంస్థలకు ₹ 235000 డిపాజిట్ చేసిన పూర్వ విద్యార్థి శ్రీ కె. మోహన్ బాబు గారి ఉదార స్వభావాన్ని అభివర్ణిస్తూ

కం. నిరుపేదలకెందరికో
స్థిరముగ ప్రోత్సాహమిచ్చి చేయూతకునై
మురిపెముతో లక్షలనిడి
నిరుపమ్ముగ వెలుగునొందు నిత్యమ్మితడే. 62

బడిగంట విని పరుగెత్తిన జ్ఞాపకాలను నెమరేస్తూ...

కం. గంటలు చెవి చేరగ వెను
వెంటనె పరిగెత్త వసతి వీడుచు నుండన్
ఇంటింటాశ్చర్యముతో
కంటిని రెప్పార్పకుండ కాంచిరి జనముల్. 63

బడి గంటను మ్రోగించింది బుచ్చన్ననా / జహంగీర్ పాషానా?

కం. గంటను మ్రోగించె నెవరొ
వెంటనె పసిగట్టెను ప్రతి విద్యార్థి యిటన్
టంటంటం బుచ్చన్నా
టాం టాం శబ్దమ్ము పాష ఠారెత్తించన్. 64

ప్రతిరోజు తరగతి గదులలో విద్యార్థులకు పడిన శిక్షలు

కం. "వీపు విమానము మోతలు"
కోపముతో "గోడకుర్చి" కొందరు "బింగీ"
లోపక గదగద వణికిరె
పాపమనక శిక్షపడగ ప్రతియొక్కరికిన్. 65

కం. ఓపికగా బోధన విన
నోపని విద్యార్థులెరుగ నొడలొంచుచు తా
కోపము కట్టలు దెంచుక
వీపులను విమాన మోత విభ్రమ పరచెన్. 66

తరగతి గదిలో ముక్కు చెంపలు వేయించుట

కం. చక్కని ప్రత్యుత్తరమున
నొక్కడె ప్రతియొక్కరికిక నొజ్జల యాజ్ఞన్
ముక్కును బట్టుచు చెంపల
ప్రక్కలనిక సున్నితముగ పటపట చరచన్. 67

మట్టిని మాణిక్యాలుగా నిబద్ధతతో తీర్చిదిద్దిన శిల్పులు

కం. మట్టిని మాణిక్యములుగ
పట్టును విడనాడకెపుడు ప్రతి యొక్కరినిన్
గట్టిగ క్రమ శిక్షణతో
చిట్టచివరి దాక తీర్చి చేయూతలతోన్. 68

గురువులందరిని వర్ణించడం నా సాధ్యమౌనా అంటూ

కం. అల్పుల విజ్ఞానమునన్
శిల్పమ్ములుగాను మల్చి శ్రీకరముగనే
నిల్పిన గురువుల నెల్లర
తెల్పుట నాసాధ్యమౌన తృప్తిగ నిపుడున్. 69

మనలోని అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని తొలగ జేయుట

కం. నిండుగ నండను నిలుచుచు
చండాడిరి మూర్ఖతనిక శ్రద్ధాసక్తిన్
దండించుచు దరిదాపుల
నుండకయె తరిమిరి మనల నొజ్జలునెల్లన్. 70

కం. మమకారముతో శిక్షణ
విమతిని తొలగింపజేసి విభ్రమముగనే
గమనించుచు దాటించిరి
క్రమముగ పాఠాలు నేర్పి ఘన కీర్తనులై. 71

కం. కూటికి నేడ్చిన వారల
పాటిగ క్రమశిక్షణ నిడి పాఠ్యాంశములన్
మేటిగ మెదడున నిలుపుచు
దాటించిరి హిమశిఖరము దరహాసమునన్. 72

పాలెం పాఠశాల గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ .....

కం. వరదుని కృపతో కొన్నిట
గురుమూర్తుల కృషిని కృతిగ కూర్చుటకొరకై
స్ఫురణకు గైకొనుచుండగ
మరువకనందించె నాకు మదిలోతులలోన్. 73

ఆనాటి పాలెం గురుదేవుళ్ళందరిని స్మరిస్తూ

కం. ఉద్దండుల బోధన సరి
దిద్దుచు మన జీవితముల ధీ శాలురుగా
నిద్ధరణిని సేవకునై
ముద్దుగ నిలిపిరి మనలను ముచ్చటదీరన్. 74

7వ తరగతి లో వివిధ పాఠ్యాంశములు బోధించిన గురువులు

సీ. సద్గురు మూర్తులు సత్కృపతోడ తా
మండదండగనుండి రందరకును
శాస్త్రాల సారమ్ము సంగ్రహించియు మన
కందించి రత్యంత సుందరముగ
మట్టి బుర్రలనెల్ల పట్టును వీడక
నవగాహనముచేసి రదురకెపుడు
బాధ్యత నెరిగించి పాఠ్యాంశములు నేర్పి
విజ్ఞానవంతులై వెలుగుడనిరి

తే.గీ. సాంబశివరావుసాంఘిక శాస్త్రమునకు
వెలుగ జేసెను బాల్ రెడ్డి తెలుగునందు
జంతు శాస్త్రమ్ము మనకు భుజంగరావు
గణితశాస్త్ర మ్ము రాజయ్యగారొసగిరి. 75

సుబ్బయ్య గారి ఆశయము నెరవేర్చుటకై శిష్య రత్నాలను సానబట్టిన గురుమూర్తులకు ప్రణమిల్లుతూ

కం. శ్రీకరముగ నెల్లరకిట
ప్రాకటముగ విద్యనేర్పి ప్రజ్ఞానిధులై
లోకాభ్యున్నతి కోరుచు
సాకారము చేయుడనిరి సద్గురు మూర్తుల్. 76

3, 4, 5, 6 తరగతులు బోధించిన గురువులు

సీ. ఆప్యాయతను పంచి యాంగ్లంబు నేర్పించె
వేంకట రమణయ్య విబుధవరుడు
ఆహార నియమాల నాచరింపను జూపె
శ్రద్ధతో సత్యనారాయణుండు
కన్నెర్ర చేయుచు కరుణతో స్లీవమ్మ
యెరిగించె విషయాలనెల్లరకును
గౌరవతతి నీతి కథలను వినిపించి
యమ్మగాను సరస్వతమ్మ మనకు
తొడపాశమును బెట్టె నేడ్చినన్ విడువక
దండించె నిటను సుదర్శనుండు
టుర్రని రూపాయి పిర్రలన్ కట్ చేయ
బెదిరించె కృష్ణయ్య ప్రేమపంచి
తే.గీ. జ్ఞాపకాలన్ని నెమరేయ శక్తికొలది
పద్యభోజనమందించి పరవశమున
పూర్వ విద్యార్థి సత్సంఘ పూజ్యులరసి
యారగింప ముందుంచితి నందరకును. 77

గురు దేవుళ్ళను స్మరిస్తూ

కం. స్థిరముగ సుఖ జీవితమును
వెరువక కొనసాగ జేయ విద్యాధనమున్
విరివిగ నా కందించిన
గురుమూర్తుల మరువలేను గోవర్ధనుడన్. 78

గురుదేవుళ్ళు

కం. ముడిరాళ్ళను చేబూనుచు
కదు రమ్యపు శిల్పములుగ కాంతులనీనన్
మడిగట్టుగ మలిచిరి కద
విడువక ఘనకీర్తికాంత విభ్రమమొందన్. 79

ఆనాటి పాలెం ఆదర్శోన్నత పాఠశాల ఉపాధ్యాయులు

కం. పుక్కడికిట వేతనమును
మెక్కగలే దెవ్వరైన మిక్కిలి శ్రద్ధన్
చక్కని బోధనతోడను
నిక్కచ్చిగ పాఠములను నేర్పిరి మనకున్. 80

వరుసగా పరమపదిస్తున్న గురువులను స్మరిస్తూ

కం. పరమపదించిన గురువుల
స్మరణను గైకొన్న దుఃఖ సాగరమందున్
పొరలుచు నూపిరి యాడక
కర చరణము లదురుచుండ కన్నీరొలుకున్. 81

కం. గురుమూర్తులనొక్కొక్కర
ధరణిని విడనాడజేయ తగునా? దేవా!
వరదుడవని నమ్మితి నిను
పరమాత్మా! మాకొసంగు ప్రతిఫలమిదియా!? 82

తోటపల్లి సుబ్రహ్మణ్యం స్మారక (ఆదర్శ) ఉన్నత పాఠశాల

ప్రాథమిక పాఠ్యాంశములు బోధించిన గురువులందరిని పేరు పేరున స్మరిస్తూ...

కం. ఉన్నతముగ నిల్పుటకై
యెన్నక తమ కష్టములతి యిష్టమ్ముగనే
మిన్నగ బోధించుచునిట
మన్ననలను పొందిరెపుడు మహనీయగుణుల్. 83

కం. క్రతువుగ బోధన సల్పిరి
సతతము వెన్నంటి నిలిచి సద్గురు మూర్తుల్
ప్రతివిషయ మెఱుకపరచిరి
కృతులను జల్లెడను బట్టి కేవలమిటనే. 84

కం. భౌతిక రసాయనమ్ముల
ప్రీతిగనే జంతు వృక్ష శాస్త్రమ్ములనే
లోతుగ నాలోచింపను
చైతన్యము నింపిరిచట శ్రద్ధాసక్తిన్. 85

కం. ప్రత్యేకమ్మగు శ్రద్ధను
నిత్యము విడనాడకెపుడు నిర్మల హృదయుల్
భత్యముకై యాశింపక
యత్యంతాసక్తి కలిగి సద్బోధకులై. 86

హెడ్ మాస్టర్ శ్రీ వెంకయ్య గారి సేవలు

కం. గురువగు వెంకయ్యాఖ్యుడు
వెరపించుచు కఠినముగను విద్యార్థులనున్
సరియగు దారుల నడుపుచు
నిరుపముగా చదువు నేర్పి నిలిపెను భువిపై. 87

కం. తెలుగంటే జీవితమున
విలువలు బోధించునట్టి విద్యయటంచున్
పలువురు మెచ్చు విధమ్మున
తెలిపిన గురుమూర్తి యితడు దిక్కులకెల్లన్. 88

కం. మన పాలెము గురుమూర్తులు
వినజేసిన పాఠములను విశ్వాసముతో
మనసున నిలిపిన శిష్యులు
ఘన జీవిక లందుకొనిరి గౌరవప్రదమై. 89

హెడ్ మాస్టర్ శ్రీ వెంకయ్య గారిని స్మరిస్తూ

కం. బెత్తము ఝుళిపించుచు మన
చిత్తములో భ్రమలు తొలగ జేయుచు తృప్తిన్
పొత్తమ్ములతో విద్యా
వేత్తలుగా తీర్చి దిద్దె వెంకయ్య యిటన్. 90

క్రమశిక్షణకు మారుపేరు వెంకయ్య గారు

కం. తరగతిగదులందుండక
గురువుల పాఠాలు వినక గోప్యముగను చి
ల్లరగా నటునిటు తిరిగిన
నరయుచు భరతమ్ము బట్టి యదుపుననుంచెన్. 91

ప్రార్థనకు రాని విద్యార్థులకు విధించిన శిక్ష

కం. క్రమముగ ప్రార్థనకందని
విమతులనిట చక్కదిద్ది వీక్షణములతో
మమకారము వీడుచు వి
భ్రమనొందను కీళ్ళు విరుగ బాదుచునుండెన్. 92

వెంకయ్య గారు తీసుకున్న స్పెషల్ క్లాసుల గురించి

కం. ప్రత్యేకపు తరగతులిట
నత్యంతాసక్తి కలిగి యాంగ్లము కొరకై
నిత్యము కొనసాగించుచు
సత్యముగను నేర్పుచుండె సంభాషింపన్. 93

వెంకయ్య గారి భయానికి విద్యార్థుల ప్రవర్తన

కం. చక్కని మార్గమునెరుగక
చక్కర్లను కొట్టువారి సంగతి నరయ
న్నెక్కడికక్కడ పారుచు
నక్కిరి గోడలను గుంటనక్కలుగానే. 94

హెడ్ మాస్టర్ వెంకయ్య గారి పాత్ర

కం. సదయుడు వెంకయ్యార్యుడు
చదువున రాజీ పడకను సచ్ఛీలమ్మున్
ముదమొప్పగ నేర్పించుచు
గదగద వణికింప జేసె గర్వాంధులనున్. 95

వెంకయ్య గారి ముఖారవిందము వికసించినప్పుడు

కం. విహితమ్మగు విషయమ్ముల
సహనముతో నాలకించి సందోహము నీ
కహనాలెందులకనుచును
హహహహ యనె నవ్వులొలికి హాయిని కూర్చెన్. 96

వెంకయ్య గారు ఇంగ్లీష్ పాఠాలు బోధించిన తీరు

కం. శ్రవణమ్ములకింపొనరగ
నవసరమైనంతవరకు నద్భుతరీతిన్
వివరించుచు పాఠ్యాంశము
నవరసముల నొలకజేసె నలుగురు మెచ్చన్. 97

బోధనలో విశ్రాంతి నాశించని మహానుభావుడు వెంకయ్య గారు

కం. అలుపెరుగని శ్రామికుడై
పలువురు విద్యార్థులిలను ప్రజ్ఞానిధులై
వెలుగొందుట కొరకై ఘన
విలువలు బోధించిరెవరు వెంకయ్యయెగా. 98

పాలెం ఆనాటి విద్యార్థులు మరిచి పోవడమనేది సాధ్యం కాదేమో

కం. మన సారగ బోధించిన
మన గురువుల మరువ తరమ మాన్యులు వారల్!
యనుదిన మండగ నుండుచు
వినతులు నెరవేర్చుచున్న వేంకటరమణున్. 99

విద్యార్థుల మనసులో ఉన్నచీడపీడలను నివారించుట

కం. చీడలు పీడలు వీడుచు
చూడను చిగురాకులేసి చోద్యమ్ముగనే
యోడక నెదురునులేకను
వేడుక కలిగించుచుండె వీక్షణములకున్. 100

విద్యార్థుల హృదయాలలో ఉన్న కల్మషాలనే కలుపుమొక్కలను తొలగించుట

కం. అనుదినమరయుచు మొలకల
మనసారగ పెంపుజేయ మదిలోతులలోన్
కనుగొని సూక్ష్మపు దృష్టిని
పెనవేసిన కలుపునెల్ల పెకలించగనే. 101

నిద్రమత్తును వీడకుంటే....

కం. చనుదెంచుటనెరుగకయే
మనసారగ కునుకు దీయు మహనీయులకున్
వినజేయక మాటలతో
మునుముందుగ బెత్తమునను ముద్దాడించెన్. 102

హాస్టల్ పర్యవేక్షణ

కం. ఇరు సంధ్యాసమయమ్ముల
నరయుటకై వసతిగృహము నడుగిడి రెపుడున్
మరువక చదివించుటకై
గురుతుగ వెంకయ్య శర్మ గోప్యమ్ముగనే. 103

పర్యవేక్షణతో విద్యార్థుల జాగ్రత్తలు

కం. అలికిడి విని విద్యార్థులు
విలవిల మని తల్లడిల్లి వీడుచు నిద్రన్
తెలివిగ పొత్తము పైనను
నిలిపిరి తమ దృష్టి నెల్ల నేర్పు వహింపన్. 104

8 నుండి 10వ తరగతులలో తెలుగు బోధించిన గురువు

కం. ఆదర్శోన్నత బడిలో
నాదరమున పద్యగద్యమన్నియు తానై
కాదనకుండగ నేర్పన
మోదముతో నేర్పిన గురుమూర్తి యతండే. 105

5, 6 తరగతులకు గణితము బోధించిన కీ.శే. చంద్రమౌళి గారిని స్మరిస్తూ

కం. లెక్కలు సులభమగుటకై
యెక్కాలను నేర్పుచుండె నెంతో శ్రద్ధన్
ఒక్కటి తప్పిన వెంటనె
నిక్కరులన్ తడుపజేసె నిర్దయుడగుచున్. 106

కీ.శే. శ్రీ కొండారెడ్డి గారిని స్మరించుకుంటూ

కం. అనునిత్యము విద్యార్థుల
కనువుగ పాఠాలు నేర్పి యాదర్శముగన్
మనుజుల మధ్యన నిలిపిన
మన కొండారెడ్డి గురుని మరచుట తరమా? 107

కం. ఆదర్శోన్నతబడిలో
నాదరమున పద్య గద్య మన్నియు తానై
కాదకుండగ నేర్పున
మోదముతో నేర్పె మనకు ముచ్చట దీరన్. 108

శ్రీ కొండారెడ్డి గారి పద్యపఠనము విని

కం. విద్యాలయమున చక్కగ
పద్యాలాపనము వినిన పరవశమొందన్
విద్యార్థులెల్లరు తమ
రద్యయనము చేయుటాప నరసితి నిచటన్. 109

హిందీ మాస్టర్ శ్రీ గురూజీ (శేఖర్) గారిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ

క. అల్లరి పిల్లల నరయుచు
మెల్లగ దారికిని తెచ్చి మేలొనరించెన్
ఎల్లరు మెచ్చంగ "నొరే
యుల్లూకా పట్ట"యనుచు నొజ్జగు శేఖర్. 110

పాలెం పాఠశాలలో ప్రారంభంలో పనిచేసిన గణిత శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీ పట్టాభి రామయ్య, కె.యం. రామిరెడ్డి, కోటేశ్వరరావు, శ్యామసుందర్ గారలు

సీ. పల్లెపాలెమునందు ప్రఖ్యాతి గాంచిన
గణితశాస్త్రమునందు గౌరవతతి
యుద్దండ పండితు లొజ్జబంతులువీరు
విడమర్చి యంశాలు విలసితముగ
విద్యార్థి హృదయాల నాద్యంతమునునిల్పి
సుస్థిర స్థానము చూరగొనిరి
శాస్త్ర కోవిదులైన సద్గురు మూర్తులు
శ్రద్ధతో సద్బోధ సలిపిరిచట
పట్టాభిరామయ్య భవ్య కోటేశ్వర
శ్యామ సుందరు మరి రామిరెడ్డి

తే.గీ. హృదయ ఫలకాలపై నిల్చి కుదురుగాను
పదిలమైయున్నరెల్లరు ముదముతోడ
మరువ తరమౌనమనమిల మాన్యులనిక
స్మరణవిడనాడకుందుముశాశ్వతముగ. 111

1964 నుండి1966 వరకు 3 సంవత్సరాలు 10 వతరగతికి గణాంక శాస్త్రము బోధించిన రామేశ్వరయ్య గారు

సీ. శ్రద్ధతోడగణాంక శాస్త్రమునంతయు
విస్పష్టమొనరించె విబుధుడెవరు
తరగతి యంతయు తన్మయత్వముచెంద
వినజేసె తృప్తిగా విజ్ఞుడెవరు
దరహాసవదనుడై పరమాద్భుతముగాను
బోధించనేతెంచె పూజ్యుడెవరు
రమణీయముగనల్వరాణినాట్యముచేయ
నుచ్చరించుచునున్న యొజ్జ బంతి
తే.గీ. వారి దస్తూరితిలకించి వందనమిడి
పరవశించిరి ముగ్ధులై ప్రాకటముగ
సుగుణధాముడౌ సుబ్బయ్య సోదరుండు
నతను రామేశ్వరయ్య నామాఖ్యుడనిరి. 112

గణిత భౌతిక శాస్త్ర బోధకులు శ్రీ రామ్ రెడ్డి, శ్రీ ప్రతాప్ రెడ్డి గారలను స్మరిస్తూ

కం. గణితము భౌతిక శాస్త్రాల్
మన బుర్రలకెక్కుటకని మహనీయముగన్
వినజేసిరి సులభమ్ముగ
రామ్ రెడ్డి ప్రతాప రెడ్డి ప్రత్యంశములన్. 113

శ్రీ కసిరెడ్డి జగన్నాథ్ రెడ్డి (జంగిరెడ్డి) గారిని గురించి

కం. అంగ్లము సాంఘిక శాస్త్రము
మింగుడుపడకున్న మనకు మెప్పొనగూరన్
ముంగిట నిలిపెను సారము
పొంగించుచు జంగిరెడ్డి పూజ్యగురుండున్. 114

హైస్కూల్ లో సాంఘిక శాస్త్రం, ఇంగ్లీష్ బోధించిన ఉపాధ్యాయులు శ్రీ జగన్నాథ రెడ్డి , శ్రీగోపాల్ రావు, శ్రీ మాధవరావు గారలు

కం. తదితర శాస్త్రము లన్నియు
ముదమొప్పగ బోధసల్పి ముచ్చట దీర
న్నదిరించుచు కన్నులతో
బెదిరించిరి సున్నితమగు బెత్తమ్ములతో. 115

శ్రీ మాధవరావు, కీ.శే. గోపాల్ రావు గారల బోధనను గుర్తుచేసుకుంటూ

కం. గోపాల్ మాధవరావులు
కోపము కనపరచుచు నిక కూర్మిని శ్రద్ధన్
చూపుచు సాంఘిక మాంగ్లము
నోపికగా బోధ సల్పిరొనరుగ విషయాల్. 116

డ్రాయింగ్, డ్రిల్ మాస్టర్ శ్రీ మల్లారెడ్డి గారిని గురించి

కం. ఆటల నాడించుచు నిట
పోటీతత్వమును పెంచి పోరాడుటకై
మేటిగనండగ నిలిచెను
పాటిగ ప్రార్థన గురువును మల్లారెడ్డే. 117

శ్రీ కె. హనుమంతరావు గారిని గురించి

కం. ఉన్నతమగు బోధనతో
నెన్నక మా నేరములను నెంతో ప్రీతిన్
మిన్నగ ప్రోత్సాహమ్మును
నన్నిట నందించె గురువు హనుమాఖ్యుండున్. 118

హిందీ బోధించిన శ్రీ దరివేశలి సర్ ను స్మరిస్తూ

కం. జాతీయభాషహిందీ
నీతిగ విద్యార్థులెదిగి నేతలునగుటన్
చైతన్యమునందించుచు
ప్రీతిగ బోధించెనుదరి వేశలి గురుడున్. 119

శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ప్రాచ్య కళాశాల

ప్రిన్సిపాల్ బ్రహ్మశ్రీ తెలకపల్లి విశ్వనాథ శర్మ

సీ. దేవభాషను నేర్చి తృప్తిగా విద్యార్థు
లెల్లరకెరిగించ నేగుదెంచె
ప్రాచ్యకళాశాల ప్రాచార్యుడై తన
విధినిర్వహణమందు ప్రీతి కూర్చె
పాలనా నియమాల పాటించి శ్రద్ధగా
నాదర్శముగనుండె నందరకును
నున్నత భావాల నొనరుగా బోధించి
చక్కని మార్గాన సరిగ నిలిపె
తే.గీ. బ్రహ్మశ్రీ బిరుదమునొందె పండితాలి
పరవశమునొందజేసెనీ పల్లెయందు
తెలకపల్లి వంశాబ్ధిని తేజరిల్లు
చంద్రుడై విశ్వనాథుడు సద్గురుండు. 120

కీ.శే. బ్రహ్మశ్రీ తెలకపల్లి విశ్వనాథ శర్మ గారిని స్మరిస్తూ...

కం. విద్యా వాచస్పతియై
విద్యుల్లత నలువరాణి వెక్కసపడగా
నాద్యంతమ్మును సంస్కృత
మద్యయనము వీడకుండె నభిమానముతో. 121

అధ్యాపకులు శ్రీ వింజమూరి శేషఫణిశర్మ

సీ. పల్లె పాలెము నందు ప్రాచ్యకళాశాల
పండితోత్తములందు ప్రథమ గురువు
సంస్కృతాంధ్రములందు సకల శాస్త్రాలను
పూర్తిగా నెరిగిన పూజ్య గురువు

దరిచేరు శిష్యులన్ దరహాసవదనుడై
ముక్తి మార్గము జూపు ముఖ్య గురువు
జన్మసార్థకతకు సత్యసాయీశుని
మహితసన్నిధినున్న మాన్య గురువు
తే.గీ. స్వామి సేవలో మునిగిన శాంతమూర్తి
దివ్యమార్గము చూపించు దేవగురువు
వింజమూరాఖ్య వంశాబ్ధి విబుధవరుడు
శేషఫణిశర్మ గారిని చేరి కొలుతు. 122

శ్రీ వింజమూరి శేషఫణి శర్మగారి బాలవ్యాకరణ బోధనను గుర్తుచేసుకుంటూ

కం. వివరముగా వ్యాకరణము
వివరించెను వింజమూరి విద్యార్థులతో
నవగాహనమొనరించుట
నవసరముగనెంచె హృదికి హాయిని కూర్చన్. 123

కం. క్రోధము దరిచేరక యా
మోదముతో బోధసల్పె ముచ్చటదీరన్
సాధారణ మాజీవిక
నీధరణిని సాగజేసె నెల్లరు మెచ్చన్. 124

కం. ఆద్యంతము కడు శ్రద్ధగ
విద్యార్థులవృద్ధి కోరె విబుధేశ్వరుడై
ఉద్యోగపు ధర్మమ్మును
భాధ్యతగా నెరపుచుండె భారమనక తాన్. 125

కం. న్యాయము ధర్మము హృదిలో
పాయక యిక సత్యసాయి భక్తుండయ్యెన్
కాయము శాశ్వతమాయని
ధ్యేయమునకు పాటుబడెను దీక్షాదక్షన్. 126

సంస్కృతాంధ్రోపన్యాసకులు శ్రీ ములుకుట్ల రామకృష్ణ శాస్త్రి గారు

సీ. సదయుడీ ములుకుట్ల సద్వంశజాతుండు
ప్రాచ్యకళాశాల పాలెమందు
సకల శాస్త్రాలలో సారము గ్రోలినన్
సామాన్యుడుగనుండె సంఘమందు
దీనులన్ దరిచేర్చి దీవెనలందించి
యభివృద్ధి పథమున నడుగిడుమనె
కల్మషమెరుగని కరుణా సముద్రుడై
విద్యార్థులెల్లరన్ వెలుగజేసె
తే.గీ. ప్రోత్సహించుచునుండెను పూర్తిగాను
విష్ణురూపుడీ శ్రీరామకృష్ణ శాస్త్రి
ఆంధ్ర సంస్కృతభాషల నద్భుతముగ
బోధసల్పి మెప్పునుపొందె పూజ్యగురుడు. 127

శ్రీ తలముడిపి బాలసుబ్బయ్య గారు సంస్కృతాంధ్ర పండితులు

కం. తెలుగున దిగ్గజమైనను
తలముడిపిని వంశజుండు తరగతి గదిలో
పలువురు విద్యార్థులనిక
నిలుపుటకై జ్ఞాన మందు నేర్పుచునుండెన్. 128

కీ.శే మామిడన్న సత్యనారాయణ మూర్తి గారిని స్మరిస్తూ....

కం. కోమలహృదయుండగుచును
ప్రేమగ విద్యలను నేర్పి పెన్నిధి యగుచున్
క్షేమాశీస్సులనొసగె 'న
సామాన్యుడు' మామిడన్న సద్గురు డెలమిన్. 129

శ్రీ మామిడేల సీతారామశాస్త్రి గారు

సీ. విద్యార్థుల కిచట విస్పష్టముగ బాల
వ్యాకరణమునేర్పె పట్టుదలను
సత్సంఘమును కోరి సత్సంప్రదాయమ్ము
నాచరించుచునుండె నవనిసురుడు

కమనీయమైన సుగంధము వెదజల్ల
కావ్యమాభరణముల్ కాంతులీన
కావ్యకన్యకలను గౌరవమ్ముగ తీర్చి
దిద్దుడటంచును తెలియపరచె
సాహిత్య మకరంద సారము లోకుల
కందింప జేసె తా నద్భుతముగ
తే.గీ. మామిడేలాఖ్య వంశాబ్ధిసోము నిచట
కంటి ప్రత్యక్షముగ నేను కనుల ముందు
ప్రముఖ శాస్త్ర కోవిదుడైన పండితులను
సదయుడైన సీతారామ శాస్త్రి గురుని. 130

ఆంగ్లోపన్యాసకులు శ్రీ పతంజలి గారు

సీ. ధరణీతలమునందు పరభాషపై ప్రజ
లాదరించుచునుండ మోదమలర
నాంగ్లబోధనచేత నాకట్టుకొనుచు తా
నభిమానపాత్రుడై యందరినిట
తీర్చిదిద్దుచునుండ తృప్తి విద్యార్థులు
సఫలులై సాగిరి సంతసమున
శ్రద్ధతోనిత్యము సన్మార్గమున నిల్పి
సత్సంఘమున నిల్పి సాగుడనెను
తే.గీ. ఆంగ్ల భాషనేర్పించుచు నాదరమున
బ్రతుకు మార్గము చూపించె బాధ్యతగను
ఆర్యుడైన పతంజలి యవనిసురుని
మరువ తరమౌన చరితార్థ మాన్యునిచట. 131

శ్రీ బి. రామచంద్రయ్య లీడర్ ఇన్ ఇంగ్లీష్

కం. పరభాషాంగ్లమునెంతో
మురిపించుచు నేర్పుచుండె ముచ్చటదీరన్
వెరుపెరుగక ఛాత్రులకును
సరదాగా రామచంద్ర సద్గురు విచటన్. 132

డా|| శ్రీ పెరంబుదూరు శ్రీరంగాచార్యులు గారు

సీ. సద్గురుమూర్తియై సకలశాస్త్రమధువు
మధుపమైగ్రోలిన మాన్యుడితడు
శిష్యగణమునెల్ల చేరదీయుచు నిత్య
నూతనవిషయాలు నేర్పుచుండు
ప్రాతఃసమయమున భక్తిప్రపత్తితో
స్మరియించెద నతని సదయుడనుచు
ధరణిపై నాజన్మ ధన్యత చేకూర్చె
సాహిత్య రంగాన సరిగ నిలిపె
మా యిలువేలుపై మార్గ దర్శకుడయి
వెన్నుతట్టుచునుండు వీడకెపుడు
ఆజానుబాహుడై యరవిందలోచనల్
దరహాసవదనుడు ధర్మప్రభువు
గంభీరముగ మ్రోగు కంచుకంఠమువలె
పద్యాలు పఠియించు ప్రాకటముగ
తే.గీ. వరదుడై పాలెమునను గోవర్ధనునకు
మార్గ నిర్దేశకుడునైన మాన్యుడితడు
భువి పెరంబుదూర్వంశజ పూజ్యుడగుచు
ధీర గుణుడు రంగాచార్యు ధీవరుండు. 133

కీ.శే. డా|| కపిలవాయి లింగమూర్తి గారిని స్మరిస్తూ...

కం. మరుగున బడుచుండగ మన
మరయని విషయమ్ము లెన్నొ మనసారగనే
పరిశోధించుచు నిరతము
విరివిగ మన కపిల వాయి వెలువడ జేసెన్. 134

శాసన పరిశోధకులు శ్రీ కపిలవాయి లింగమూర్తి గారు

సీ. కాలగర్భమునందు కలిసిన ఘనమైన
చరిత వెలికితీయ శ్రద్ధబూనె
నూరూరు దర్శించి పేరెన్నికను గన్న
పౌరుల దరిచేరి పలుకరించె

పరిపాలకుల శిలా ఫలకాలనెన్నియో
శక్తియుక్తులతోడ సంతరించె
పరిశీలనార్థమై నిరతము శ్రమచెంది
యెరిగించె విజ్ఞులకెల్లరకును
తే.గీ. సూక్ష్మదృష్టితో వీక్షించి యక్షరముల
రూపురేఖల నెరుగుచు నోపికగను
స్పష్ట పరిచెను భాషల పదములన్ని
కవులు పండితులును మెచ్చ కపిలవాయి. 135

కళ్యాణ మంటమున రోజువారీ అద్దె గృహముల గురించి నాడు – నేడు

సీ. దేవునిదర్శింప దిక్కుదిక్కులనుండి
యరుదెంచు భక్తుల నాదరించె
నన్నప్రసాదాల ననువైన వసతుల
కల్పించె నత్యంత గౌరవముగ
కొరత లేకుండగ వెరువక నెల్లర
కండదండగనుండె నడుగడుగున
సుశ్లోకుడైనట్టి సుబ్బయార్యుని గూర్చి
సంస్తుతి జేసిరి సకలజనులు
తే.గీ. భక్తి భావము పెంపొంద పాటుబడెను
ధనము సమకూర్చ నిసుమంత తలపులేదు
పెట్టుబడిదారులీనాడు మెట్టుదిగక
పైకమునులాగుచున్నారు ప్రాకటముగ.

శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు

ప్రధానాచార్యులు శ్రీ నాగేశ్వరరావు గారు

కం. పద్ధతిగా విద్యార్థులు
బుద్ధిగ విజ్ఞానమంది పూజ్యత నొందన్
కుద్దుగ పరిపాలించెను
శ్రద్ధగ నాగేశ్వరాఖ్య సద్గురువిచటన్. 136

కీ.శే. శ్రీ లక్ష్మారెడ్డి గారు

కం. అలవోకగ పద్యమ్ముల
సలలితముగ కంఠమందు సప్తస్వరముల్
ఒలికించగ నే వ్రాలిరి
పలువురు లక్ష్మాఖ్య గురుని పాదమ్ములపై. 137

తెలుగు పాఠ్యాంశబోధకులు శ్రీ లక్ష్మారెడ్డి, హరీంద్రబాబు గారలు

సీ. నవరసా లొలికించు వివిధాంశముల గూర్చి
శ్రవణాలకింపుగా సాగజేసి
లోతైన వంశాల ప్రీతిగా నెరిగించి
యాకట్టుకొనుచుండి రద్భుతముగ
విబుధవరడు రాఘవేంద్రుని నమ్మిన
భక్తహరీంద్రాఖ్య బాబుగారు
వీనులవిందగు విభ్రమములను ల
క్ష్మారెడ్డి గురుడిట ఘనముగాను
తే.గీ. ఏడు స్వరముల నొలికించె నెలమిగాను
తన్మయత్వము నొంద విద్యార్థులెల్ల
సాగజేసిరి యిరువురు శ్రద్ధబూని
మాన్య చరితులీ గురువుల మరువ తరమ? 138

ఆంగ్ల బోధకులు శ్రీ లక్ష్మీనారాయణ, శ్రీ కృష్ణమూర్తి గారలు

సీ. అవనిపై విస్తృతంబగు నాంగ్లమున పట్టు
సాధించి రిటనున్న సద్గురువులు
గణుతింప తగిన నిఘంటువు రూపొందె
శ్రీలక్షిపతి నాము చేత నిచట
గోకులనందన గోపితాప్త్యుడునైన
శ్రీకృష్ణ మూర్తియు చింతలేక
పాఠ్యాంశములలోని ప్రత్యంశమును కూడ
విడమర్చి బోధించి వెరపులేక
తే.గీ. తీర్చి దిద్దిరి విద్యార్థి తృప్తి నొంద
సాగి సందేహములు తీరి సంతసింప
నీసడింపెర్గకుండగ నింపుమీర
బోధ సల్పుట నెరిగితి పూజ్యగురుల. 139

భౌతిక శాస్త్ర బోధకులు శ్రీ నాగరాజు, శ్రీ పార్థివేశ్వరరావు గారలు

సీ. ప్రకృతిని సిద్ధమౌ భౌతిక శాస్త్రము
మూలాల నెరిగించి స్ఫూర్తి నింపి
అంతుచిక్కని మేటి యవనిపై వింతల
సుస్పష్టముగ నెల్ల చూడ జేసి
ధరణీతలమునన్ ధ్వని, యయస్కాంతాలు
తత్త్వము నెరిగించి చిత్తమలర
గగనాంతరాళాన గ్రహకూటమిని గూర్చి
విద్యార్థుల మెదడు వెలుగ జేసి
తే.గీ. అద్భుతంబుగ నాగరాజాఖ్య గురుడు
రమ్యగుణ పార్థివేశ్వర రావు చెలగి
శ్రవణపేయమ్ముగను బోధ సాగుచుండ
సరిగ నిశ్శబ్దతను కల్గి సఫలమొంది
నామమాత్రము విద్యార్థి నవ్వులొలికె. 140

రసాయన శాస్త్ర బోధకులు శ్రీరామచంద్ర మూర్తి, శ్రీ సీతారామయ్య, శ్రీ రామకృష్ణ, కేశవ స్వామి గారలు

సీ. అణు పరమాణువు లద్భుత బంధాల
విడమర్చి రిటనున్న విబుధవరులు
శ్రద్ధతోడ నిట రసాయన శాస్త్రమ్ము
రామచంద్రాఖ్యుండు, రామకృష్ణ
చిద్విలాసముతోడ సీతరామయ్యయు
కేశవస్వామియు కీర్తిధనులు
వసుధపై నెలకొన్న వర్గీకరణ గూర్చి
యర్థవంతముగ విద్యార్థులెల్ల
తే.గీ. సరిగ నవగాహనము నొంది శ్రమయె లేక
మెదడుకెక్కింప జేసిరి మేటిగాను
శాస్త్ర కోవుదులైనట్టి సద్గురువులు
మరువతరమౌన దేహము మరణమైన. 141

కీ.శే. శ్రీ రామచంద్ర మూర్తి గారిని స్మరిస్తూ

కం. పదుగురు మెచ్చు విధమ్మున
సదయులునై ప్రోత్సహించి సంస్కారముతోన్
కుదురుగ బోధించిరి కద
ముదమొప్పగ రామచంద్రమూర్తియు శ్రద్ధన్. 142

గణిత శాస్త్ర బోధకులు శ్రీ సుబ్బారావు గారి మధుర స్మృతులు

కం. సుబ్బారావను గురునే
యబ్బురమగు గణితబోధ నవగాహనమై
పబ్బతి బట్టిరి యెల్లరు
మబ్బులు తొలగింపజేయ మదిలోతులలోన్. 143

గణిత శాస్త్ర బోధకులు శ్రీ సుబ్బారావు, శ్రీ దుర్గా ప్రసాద్ గారలు

సీ. చక్కగాను గణిత శాస్త్రమ్ము నెల్లర
కర్థమౌ రీతిని నద్భుతముగ
సద్గురుల్ దుర్గా ప్రసాదు, సుబ్బారావు
విడమర్చి బోధించి విభ్రమముగ
నంశమ్ములేవైన సంశయమ్మును లేక
నెప్పటికప్పుడు నెరుకపరచి
చోద్యమ్ముగ హృదిని సుశ్లోకులై నిల్చి
స్మరణ గైకొనిరిట సంతసమున
తే.గీ. గణిత విద్యార్థులెల్లరు గౌరవమ్ముగ
నిలిచి రింజనీయర్లుగా నేలపైన
ప్రముఖ గురుమూర్తుల సుపాద పద్మములను
కుదురుగా నిల్పి యున్నారు హృదయమందు. 144

బాటనీ బోధకులు శ్రీ తిమ్మయ్య, శ్రీ కేశవాచారి, శ్రీ కె.ఎస్ పాపు గారలు

సీ. విశ్వాన నెలకొన్న వృక్షజాతినిచట
నామరూపాలను. నయముగాను
తనువులన్ కాపాడు వనమూలికల గూర్చి
యెరిగించెరెంతయో యింపుమీర
మాయరోగమ్ముల మటుమాయమును జేయు
నౌషధమొక్కల కందరకును
నుపయోగమును గూర్చి యొనరుగా బోధించి
రాచరింపను జేసి రద్భుతముగ
తే.గీ. సాగి తిమ్మయ్య కేశవాచారి పాపు
గారలెందరో గురువులు గౌరవముగ
నిచటి విద్యార్థులకు నెల్ల సుచరితముగ
బోధ సల్పిరి మిక్కిలి స్ఫూర్తి నిడుచు. 145

కీ.శే. పులుసు నారాయణరెడ్డి గారిని స్మరించుకుంటూ

కం. పులుసు కులాంబుధి చంద్రుడు
పలువిధముల దేశభక్తి పాఠమ్ములనే
తెలుపుచు విద్యార్థులతో
మెలిగెను నారాయణుడను మేటి గురుండున్. 146

జంతుశాస్త్రం బోధకులు శ్రీ దత్తాశరణు, శ్రీవెంకట్రామిరెడ్డి, శ్రీ పులుసు నారాయణరెడ్డి గారలు

సీ. అవనిపై కదలాడె డన్నిజీవుల యొక్క
పరిణామక్రమములన్ ప్రాకటముగ
వివిధాంశముల గూర్చి విస్పష్టముగ బోధ
సల్పెతా నిత్యము శ్రద్ధబూని
గోప్యత వీడి దేదీప్యమ్ముగను పాఠ్య
భాగాలు నుడివిరి పట్టువిడక
శస్త్ర చికిత్సలు శ్రద్ధగా నొనరింప
విస్పష్టముగ నేర్పి వెరుపెరుగక
తే.గీ. వైద్య రంగాన నిలిపిరి వసుధపైన
ధీమతుండైన వేంకటరామి రెడ్డి
మరియు దత్తాశరణుగారు మాన్యుడికను
పులుసు నారాయణారెడ్డి పూజ్య గురులు. 147

పాలెం కాలేజీ లో N. C. C

కం. అరివీరభయంకరులుగ
స్థిరముగనెదురొడ్డి చీల్చి చెండాడుటకై
సరియగు శిక్షణనొందిరి
వెరువక విద్యార్థి వీర విక్రమసింహుల్. 148

NCC శ్రీ రామకృష్ణ గారు

సీ. దేశ రక్షణకోరి దీక్షబూనినవారి
లక్ష్యము నెరవేర్చ శిక్షణనిడె
సరిహద్దులను చేరి సమర శంఖమునూది
ప్రాణ త్యాగముచేయ పాటుబడుచు
చొరబాటు దార్లకు చుక్కలు చూపించి
హద్దు నుంచుచు సరి హద్దులందు
కంటికి రెప్పగా కాపాడుచును దేశ
రక్షణార్థము పూని రాత్రిపగలు
తే.గీ. రామకృష్ణయ్య నిత్యము నేమముగను
శిక్షణమ్ము నందించెను లక్షణముగ
తీర్చిదిద్దుచు భారత దేశమునకు
శత్రుమూకతో పోరాడ సమరమందు. 149

వ్యాయమ శాఖ ఫిజికల్ డైరెక్టర్ శ్రీ రమేశ్ గారు

సీ. ఆటలనాడించె పాటలు పాడించె
ప్రోత్సాహమందించె పూజ్యగురుడు
నిత్యము వెన్నంటి నేర్పించె నెన్నియో
వివిధ రంగములందు వెలుగజేసె
దేహమ్ము నత్యంత దృఢమొనరింపను
శిక్షణ నొసగెను శ్రీకరముగ
రోగబాధలు పారద్రోలుచు శ్రద్ధగా
నారోగ్యముగనుంచె నందరినిట
తే.గీ. మరువ లేరురమేశాఖ్య గురువునిచట
నాటి శిక్షణ నెమరేయ మేటిగాను
కనులముందర కనబడు ఘనచరితము
నెమరు వేయగా నన్నియు క్రమముగాను. 150

ప్రిన్సిపాల్ ఆర్. రామకృష్ణారెడ్డి గారు

సీ. విఖ్యాతి నొందిన విద్యాలయమ్మని
పల్లెకేతెంచె తా నుల్లసమున
కఠినమౌ నియమాల క్రమశిక్షణను నేర్పి
పాటింప జేసిన ప్రముఖుడితను
సిబ్బంది నెల్లరు నబ్బుర పడుచుండ
నడిపించె సంస్థను నయముగాను
సమయసూచికనిక చక్కగా పాటింప
శ్రద్ధ వహించియు సఫలుడాయె
తే.గీ. ఉమ్మడిగనున్న రాష్ట్రమందున్నతముగ
తీర్చి దిద్దటుకొరకయి దీక్ష బూని
కడప జిల్లాన జమ్ములమడుగు వాసి
చేరె రామకృష్ణారెడ్డి శ్రీకరుండు. 151

తెలుగు అధ్యాపకులు శ్రీ వేంకటేశ్వర శర్మ, డా. జనార్దన భట్టు, శ్రీ ఛందోజి గారలు

సీ. ధరణీశులెల్లర ధర్మమధర్మముల్.
విద్యార్థులకు తెల్పి విరివిగాను
క్రమశిక్షణను గూర్చి ప్రముఖుల జీవికల్
తెలియపర్చిరి మాకు తెల్లముగను
మనుజుల మధ్యను ననుబంధముల గూర్చి
బోధించిరిట మాకు పూజ్యగురులు
దేశసంస్కృతి తెల్గు భాష మాధుర్యమున్
చాటి చెప్పిరి మాకు మేటిగురులు
పౌరులందరిమధ్య గౌరవమ్ముగ మేము
జీవింపజేసిరి చింతలేక
తే.గీ. వేంకటేశ్వర నామాఖ్య విబుధవరుడు
పరమపూజ్య జనార్దనభట్టు గారు
హాస్యచతురుడు చందోజి యార్యులిచట
నెరుక పరచిరి విషయాల నేర్పు మీర. 152

ఇంగ్లీష్ లెక్చరర్లు డా. మల్లేశం, డా. మోరియా గారలు

సీ. పరదేశ భాషల నిరుపమానముగాను
బోధించిరత్యంత పొందికగను
కఠినమౌ శబ్దాల కరతలామలకమై
యర్థమ్ము వివరించి రద్భుతముగ
ముదమొప్ప మల్లేశు మోరియా గురువులు
నాంగ్లమ్ము బోధించి రాదరమున
దరహాస వదనులై తరగతులందున
నెన్నెన్నొ విషయాలనెరుకపరచి
తే.గీ. గురువులందరు దీవెనల్ విరివిగాను
మాకు వెన్నంటి నిలిపిరి లోకమందు
విమల చరితార్థమును పొంద క్రమముగాను
కీర్తి కాంత యచ్చెరువొంద పూర్తిగాను. 153

భౌతిక శాస్త్రం బోధించిన సుబ్బరాయ శాస్త్రి, బాలరాజు గారలు

సీ. బ్రహ్మాండమైట్టి భౌతిక శాస్త్రము
సుజనశీలురునైన సుబ్బరాయ
శాస్త్రి బాల్రాజాఖ్య సద్గురుమూర్తులు
వివిధాంశమ్ముల నెల్లవివరముగను
నత్యంత శ్రద్ధతో నద్భుతమ్ముగ బోధ
సల్పి సందేహాలు సరిగ తీర్చి
యున్నత చదువుల నొనరుగా సాధింప
పంపిరిచటినుండి పట్టణమున
తే.గీ. శాస్త్రవేత్తలై వెలుగొంది విస్తృతముగ
వివిధఖండాంతరములందు వెలుగు డనుచు
సాగనంపిరి తృప్తిగా చదువులందు
జీవికలనెల్ల సుఖముగ చేయుడనుచు. 154

రసాయన శాస్త్రోపన్యాసకులు, శ్రీ శేషయ్య, శ్రీ వేంకటాచారి, శ్రీ వేంకటేశ్వర రావు, శ్రీ ప్రభాకర్, శ్రీ కృష్ణ గారలు

సీ. మహిని పదార్థనిర్మాణ మార్పుల గూర్చి
విస్పష్టపరచిరి విబుధవరులు
చిరుమందహాసుడు శేషయ్యతోపాటు
వేంకటేశ్వరనామ విబుధ వరులు
అర్గానికార్గానికన్నియంశాలతో
భౌతికమ్మునిట ప్రభాకరుండు
నన్నిటిన్ విడమర్చి మిన్నగా బోధించి
తీర్చిదిద్దిరి మమ్ము దిగులు మాన్పి
తే.గీ. చింతలెడబాప జేసిరి పంతముగను
సఫలమొనరింప జేసిరి సంతసమున
గౌరవమ్ముగ సంఘాన కదలుడనిరి
మరువ తరమౌన కృష్ణాఖ్య మాన్యులనిక. 155

పాలెం డిగ్రీ కళాశాల గణితోపపన్యాసకులు ప్రహ్లాద రావు, గోపాల కృష్ణరావు గారలు

సీ. గణితశాస్త్రమునందు ఘనకీర్తి గనిరి ప్ర
హ్లాద శ్రీ గోపాల రావు బుధులు
నిరుపేదవారలన్ దరహాస వదనులై
దైన్యతన్ మాన్పిరి దరికిచేర్చి
తెలిపిరి సూత్రాలు తేలిక భావాన
హృదయమ్ములో నిల్పి హృద్యమముగ
మరువక నిత్యము తరగతులెన్నైన
బోధించుచుండిరి పూర్తిగాను
తే.గీ. మేలు చేకూర్చిరీపల్లె పాలెమందు
దీనజనులెల్ల వృద్ధితో దేశమందు
నన్నిరంగాలలో నిల్చి యద్భుతముగ
పేరు ప్రఖ్యాతి నొందను ప్రేమ పంచి. 156

పాలెం డిగ్రీ కళాశాల NACC కొరకు ప్రధానాచార్యులు డా॥ విద్యాప్రవీణ గారి ఆధ్వర్యంలో కృషి సల్పిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని గురించి

సీ. కుగ్రామమైనను కొరతలేకుండగా
సౌకర్యములు నిల్పె చాలినన్ని
ప్రజల మేలును కోరి బడిగుడుల్ స్థాపించి
సంస్కరింపనుజేసి సకలజనుల
వివిధ రంగాలలో విజ్ఞానమూర్తులన్
తీర్చిదిద్దుచు పంపె ధీవరులను
దేశవిదేశాల దిగ్దిగంతాలలో
సేవకై నిలిపెను చిత్తగించి
సుబ్బయార్యుని కీర్తి సుస్థిరమ్ముగ చాటి
చెప్పను కృషిసల్పి శ్రీకరముగ
తే.గీ. నరయ నడుగిడినటువంటి యధిపతులకు
సాగి విద్యాలయపు రథ సారథియగు
విజ్ఞురాలైన విద్యాప్రవీణతోడ
స్వాగతించెనుసిబ్బంది సంతసమున. 157

జంతుశాస్త్రబోధకులు డా॥ భోన్ స్లే హీరోజీరావు గారు

కం. ఎంతో శ్రద్ధాసక్తిని
వింతగ విద్యార్థులెల్లవిజ్ఞతనొందన్
పంతముతోబోధించెను
జంతుశాస్త్ర విషయమిచట సద్గురు భోన్ స్లే. 158

భౌతిక శాస్త్రం బోధించిన డా. పి.బాలభాస్కర్ గారు

కం. లోతగు విషయములెన్నో
ప్రీతిగబోధించెమాకు ప్రేమామృతుడై
చైతన్యమునందించెను
భౌతిక శాస్త్రమున బాల భాస్కర గురుడే. 159

శ్రీ సంపత్ నరసింహాచార్యులు, రసాయన శాస్త్రం

కం. సంపతు నరసింహార్యుడు
నింపుగ బోధించిపాఠమెంతో శ్రద్ధన్
పెంపువహింపను శిష్యుల
పంపించెను సేవజేయ ప్రజలందరికిన్. 160

శ్రీ గాలయ్య, రసాయన శాస్త్రం

కం. కాలమునకు ననుగుణముగ
నాలోచన చేసి ముందునడుగిడుచున్నన్
మేలౌనకూరునటంచును
గాలయ్యార్యుండు నుడివె గౌరవముగనే. 161

శ్రీ విజయ గౌడు, రసాయన శాస్త్రం

కం. కర్బన రసాయనమ్మును
నిర్భయముగనేర్వుడనుచు నిక్కచ్చిగనే
యార్భాటములేకుండగ
నర్భకులకు విజయగౌడు హాయిగ నుడివెన్. 162

శ్రీవేంకట రమణ, రసాయన శాస్త్రము

కం. ముదమున రసాయ నమ్మును
సదయుడురమణాఖ్యగురుడు శ్రద్ధాసక్తిన్
కుదురుగనిలిపెను మెదడున
పదుగురు విద్యార్థులిచట పరవశమొందన్. 163

పద్య రచనా ప్రోత్సాహకులు

పద్యాలను చదువుతూ ప్రోత్సహిస్తున్న మాజీ ప్రిన్సిపాల్ గా|| కృష్ణ గౌడ్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ

కం. సందర్భోచితమగు నా
కందమ్ముల నరసి కృష్ణ గౌడాఖ్యుడు నా
కందించగ ప్రోత్సాహము
వందనమర్పించుచుంటి భక్తిప్రపత్తిన్. 164

గా|| శారదమ్మకు నమస్కరిస్తూ

కం. సదయులునై మీరెల్లరు
ముదమున నను ప్రోత్సహింప ముచ్చటదీరన్
మదిలో నూరిన భావాల్
కుదురుగ కందములలోన కూర్చితి నమ్మా! 165

కం. సుందరమగు కందమ్ముల
నందించగ దలచి కూర్చి హాయిగ నిదె మీ
ముందుంచితి సహృదయులు
నెందరొ సంతృప్తి నొంది రింపొనగూరన్. 166

కం. అందించను దలచగ నా
ముందర ప్రత్యక్షమయ్యె ముచ్చటదీరన్
కందము విరులద్భుతముగ
వందనముగ సరము కూర్చ వైభవమొప్పన్. 167

గా|| శ్రీమతి/ శ్రీ శారదా బాలకిష్టయ్య టీచర్ గారు మా అమ్మగా సహృదయంతో నన్ను ఆశీర్వదిస్తున్నందుకు స్పందిస్తూ

కం. వెల్లువలా పద్యమ్ముల
నల్లుచునుండగను కాంచి యానందముతో
నెల్లరు మెచ్చువిధమ్మున
తల్లిగ దీవించె శారదమ్మయు నన్నున్. 168

వట్టెం శ్రీ జయప్రకాష్ గారి ప్రోత్సాహం

కం. సహృదయ జయప్రకాష్ తా
విహితమ్ముగ ప్రోత్సహించె విశ్వాసముతో
సహనముతో పద్యమ్ముల
బహువిధములకూర్చుచుండపరశమొందెన్. 169

పాలెం గత వైభవాన్ని మరువలేనటువంటి విషయాలను పూర్వ విద్యార్థి సమూహానికి ఒక్కొక్కటిగా పద్యరూపంలో నందించుటకై ప్రయత్నం చేస్తూ

కం. ఆనాటి జ్ఞాపకమ్ముల
నీనాటికి మరువకుంటి రెంతో ప్రీతిన్
పాటిగ వర్ణించుదు నిక
కాటికి నే చేరు దాక కల మాపకనే. 170

కం. ఆగక నాకలమెప్పుడు
మూగగ నను నుండనీక మోదము తోడన్
సాగుము ముందున కనుచును
వేగమ్ముగ ప్రోత్సహించు విజ్ఞులు మెచ్చన్. 171

కం. విద్యుల్లత శ్రీవాణికి
పద్యము ఫలహారముగను భక్తుడ నే "నై
వేద్యము"గా నర్పించగ
నాద్యంతము నిలిచియున్నదండగ నాకున్. 172

కం. బాసరలో బాసిల్లుచు
వేసారక భక్తజనులవీక్షించుచునే నా
దాసుదు గోవర్ధనుడని
వాసిగనను పలుకరించు పరవశమొందన్. 173

పద్యాలను చదువుతూ ప్రోత్సహిస్తున్న పూర్వవిద్యార్థి సమూహానికి నమస్కరిస్తూ

కం. వ్రాసిన ప్రతిపద్యమ్మును
వేసారక చదువుచున్న విజ్ఞుల కెపుడున్
దాసుడనై కొనసాగుదు
త్రాసున తూచగను లేని దండమ్ములతో. 174

కం. ఇలపైనందరి ముందర
విలువగ బ్రతుకగను జేయ విద్యార్జనతోన్
కలలోనైనను బెదరక
తలలెత్తుక నిలిపినట్టి దైవసమానుల్. 175

కం. సైకిలుపై ననునిత్యము
చీకాకును చెందకుండ చేరెను బడికిన్
శ్రీకరముగ బోధించుచు
ప్రాకటముగ ప్రజలమధ్య బ్రతుకగ నిలిపెన్. 176

కం. ద్వాదశకందమ్ములనే
మోదముతో కూర్చితి గురుమూర్తికి నిడగా
నాదరమున తిలకించుడు
కాదనరని నమ్మియుంటి గౌరవతతినే. 177

కం. నాలో కలిగిన భావాల్
తేలిక పద్యాలు కూర్చి తెలుపుచు నుండన్
మేలొనగూరను మెచ్చిరి
పాలెము విద్యార్థి సంఘ ప్రముఖులు నన్నున్. 178

పూర్వ విద్యార్థులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతూ

కం. బహుళముగా పద్యాలను
విహితముగా నల్లుచుండ విజ్ఞులు మీరల్
సహనముతో చదువుచు న
న్నహరహమును మెచ్చుకొనుట యదృష్టమెగా. 179

పాలెం పూర్వ విద్యార్థి సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రిటైర్డ్ ఇంజనీర్ శ్రీ బుడ్డయ గారిని గురించి

కం. సత్సంఘమునకు 'బుడ్డయ'
యౌత్సాహిక మిత్రులెల్ల రైక్యత పరచెన్
తాత్సారము చేయక ప్రతి
వత్సరమును నిర్వహించె వైభవమొప్పన్. 180

పద్యగురువు డా|| వెలుదండ సత్యనారాయణ గారిని స్మరిస్తూ

కం. వెలుదండాంబుధిచంద్రుడు
తెలిపెను ఛందస్సు నాకు తృప్తిగ పద్యా
లలవోకగ కూర్చుటకై
పలువురు కవిమిత్రులందు పరువుగ సాగన్. 181

బాలవ్యాకరణము వ్యాఖ్యాత డా. ఆలేటి మోహనరెడ్డి గారు

కం. శ్రీకరముగ విద్యార్థులు
వ్యాకరణమునేర్చి భువిని వర్ధిల్లుటకై
వ్యాకృతినందించెను తా
లోకమునకు 'మోహనగురు' లోపము లేకన్. 182

నా లక్ష్యము నెరవేరుటకై మీ యందరి ఆశీస్సులు కోరుతూ

కం. పట్టునువీడక నల్లుదు
నట్టిట్టని మందలించకాహ్వానించన్
మెట్టును దిగకుండగ కై
కట్టుచు భూసురుని చరిత కందములందున్. 183

లక్ష్యాన్ని సాధించుటకై దీక్షబూనుట

కం. లక్ష్యము కొరకై నే ని
ర్లక్ష్యము దరిచేరకుండ రాత్రియు పగలున్
దీక్షాధారణ తో నీ
కక్షను నాదృష్టి నిలిపి కదులుదు శ్రద్ధన్. 184

పాలెం వేంకటేశ్వరుని కృపతో...

కం. వరదుడు నా వెన్నంటుచు
గురుమూర్తుల బోధనలను కొసరున మదిలో
స్ఫురణకు నందించగనే
మరువక కూర్చితిని కంద మాలగ మీకున్ 185

కం. పాలెం విద్యాసంస్థల
మేలొనరించిన గురువుల మిక్కుటముగనే
నాలోచించియు పద్యాల్
మ్రోలను నుంచితి కనుడని ముదమొప్పంగన్. 186

పద్యమాలను గురుదేవునికర్పించుట

కం. సుందరపద్యసుమంబుల
నందంబగు మాల కూర్చి యభిమానముతో
ముందుంచితి దయ జూపుచు
నందుకొనెదరని తలచెద నానందముతో. 187

ఈ పద్యోపహారం గ్రంథం అంకితం

సీ. బుడ్డయ్య రఘుమన్న మోహనుబాబును
            బాలకిష్టయ్యాది ప్రముఖులికను
పూజనీయులునైన బుచ్చయ్య లాదిగా
            గిరిజామనోహరు కృష్ణ గౌడు
మల్లికార్జున రెడ్డి మహనీయ గుణులెల్ల
            గతమంతనెమరేసి గౌరవముగ
పూర్తిగా వెన్నంటి ప్రోత్సాహమందించి
            ప్రస్తుతించుచు నన్ను ప్రాకటముగ
గురువులబోధనల్ మరువక క్రమముగా
            నందింపజేసిరి యాదరించి

తే.గీ. పూని సంతసమ్మున నూలుపోగునొకటి
చందమామకందించిన చందముగను
సుబ్బయార్య రామేశ్వర సోదరులకు
నంకితమ్మిచ్చితీకృతి నధికభక్తి. 188

ఉన్నత విద్యాశాఖ



డా॥ పి.బాలభాస్కర్
జాయింట్ డైరెక్టర్-1, ఉన్నత విద్యాశాఖ



డా॥ డి.ఎస్.ఆర్.రాజేందర్ సింగ్
జాయింట్ డైరెక్టర్-2, ఉన్నత విద్యాశాఖ




డా॥ జి.హరిహరనాథ్,

ఓరియంటల్ కళాశాల అధ్యాపకులు

కం. హరిహర నాథాఖ్య గురుని
పరమాద్భుతమైన బోధ ప్రతి యొక్కరికిన్
స్థిరముగ మదిలో నిలువగ
తరుగని ధనమాయె ననిరి తదనంతరమున్

ఆదర్శ ఉన్నత పాఠశాల, పాలెం, ఉపాధ్యాయ బృందం


శ్రీ జి.రాములు


శ్రీ ఎస్.వెంకయ్య


శ్రీ కె.జగన్నాథరెడ్డి


శ్రీ కెం.యం.రాంరెడ్డి


శ్రీ వి.ప్రతాప్ రంరెడ్డి


శ్రీ యన్.కొండారెడ్డి


శ్రీ ఆర్.శేఖర్


శ్రీ జి.గోపాల్‌రావు


శ్రీ యన్.మాధవరావు


శ్రీ కె.సాంబశివరావు


శ్రీ పి.బాల్‌రెడ్డి


శ్రీ వి.రాజయ్య


శ్రీ యన్.భుజంగరావు


శ్రీ యం.డి.దర్వేశలి


శ్రీ జి.చంద్రమౌళి


శ్రీ వెంకటరమణ


శ్రీ వి.సత్యనారాయణ



శ్రీ బి.స్లీవమ్మ


శ్రీ యమ్.సరస్వతమ్మ


శ్రీ యమ్.మలారెడ్డి


శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పాలెం, అధ్యాపక బృందం



శ్రీ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్



శ్రీ దాతాశరణ్


శ్రీ పార్థేశ్వరరావు


డా॥ఎస్.లక్ష్మీనారాయణ


శ్రీ హరేంద్రబాబు


శ్రీ కె.ఎస్.లక్ష్మా రెడ్డి



శ్రీ కె.ఎస్.పాప్


శ్రీ కె.సీతారామయ్య


శ్రీ కె.సుబ్బారావు



శ్రీ ఎ.వి.రామచంద్రమూర్తి


శ్రీ కనకరాజు


శ్రీ వి.దుర్గాప్రసాద్

శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పాలెం, అధ్యాపక బృందం


శ్రీ కె.ఎస్.ఆర్.రమేశ్


శ్రీ యం.రామకృష్ణ


శ్రీ యం.వి.తిమ్మయ్య గుప్త


శ్రీ యం. నాగరాజు



శ్రీ టి.వేంకటరామ రెడ్డి


శ్రీ బి.కేశవాచారి


శ్రీ పి.నారాయణ రెడ్డి


శ్రీ కేశవ స్వామి



శ్రీ కె.హన్మంత్ రావు, హైస్కూల్ టీచర్


శ్రీ తెలకపల్లె విశ్వనాథ శర్మ


శ్రీ వింజమూరి శేషఫణి శర్మ


శ్రీ యం.రామకృష్ణ శాస్త్రి


శ్రీ మామిడేల సీతారామ శాస్త్రి


డా॥ శ్రీరంగాచార్యులు


శ్రీ మామిడన్న సత్యనారాయణ


శ్రీ వి.వి.ఆర్.పతంజలి


డా॥ కపిలవాయి లింగమూర్తి


పి.శివరామ శర్మ


బ్రహ్మశ్రీ టి.బాలసుబ్బయ్య


డా॥ బి. రామచంద్రయ్య


డా॥ ఎ. మోహన్ రెడ్డి





శ్రీ ఎస్.రామకృష్ణా రెడ్డి, ప్రిన్సిపల్ డా॥ వి.ఆర్.తులసి రెడ్డి, ప్రిన్సిపల్

Department of Telugu



శ్రీ కట్టా వెంకటేశ్వర శర్మ



శ్రీ జనార్ధన్ భట్టు



డా॥అగ్రహారం ఛందోజీరావు

Department of English



డా॥ బి.మల్లేషం



డా॥ శ్రీమతి మోరియా యూనిస్

Department of Physics



శ్రీ జె.సుబ్బరాయ శాస్త్రి



డా॥ కె.బాల్‌రాజు



డా॥ పి.బాల భాస్కర్

Department of Chemistry

శ్రీ గాలయ్య

శ్రీ సంపత్ నరసింహాచార్యులు



శ్రీ కృష్ణ



శ్రీ వెంకటరమణ



శ్రీ విజయ్ గౌడ్




శ్రీ టి.వి. శేషయ్య



శ్రీ ఆర్.వెంకటాచారి




శ్రీ వెంకటేశ్వర రావు



డా॥ రఘునాథరెడ్డి

Department of Maths




శ్రీ వి. ప్రహ్లాదరావు



శ్రీ గోపాలకృష్ణారావు

Department Botony



శ్రీ కృష్ణారెడ్డి



శ్రీ మోహన్ రెడ్డి



డా॥ ఎస్.ఆర్.రాఘవరావు

శ్రీ కోటేశ్వరరావు

శ్రీ శ్యామ్‌సుందర్

Department Zoology



డా॥ హీరోజిరావు భోంస్లే

పద్య రచన ప్రోత్సాహకులు



శ్రీ కృష్ణ గౌడ్
రిటైర్డ్ ప్రిన్సిపాల్



శ్రీ గిరిజా మనోహర్ బాబు
రిటైర్డ్ లెక్చరర్



శ్రీ పి.బుచ్చయ్య
రిటైరడ్ టీచర్



శ్రీ జయప్రకాశ్



శ్రీ మల్లికార్జున్ రెడ్డి



శ్రీ ఎస్.కాశన్న, టీచర్



శ్రీమతి శారద, శ్రీ బాలకిష్టయ్య
రిటైర్డ్ టీచర్స్




శ్రీ జి.వీరాంజనేయులు

పాలెం రెడ్రెడ్డి దొరలు



శ్రీ ఆర్.బాలకృష్ణా రెడ్డి



శ్రీ ఆర్.పాపిరెడ్డి



శ్రీ ఆర్. విష్ణువర్ధన్ రెడ్డి




శ్రీ ఆర్. సుదర్శన్ రెడ్డి


శ్రీ ఆర్. లోహిత్ రెడ్డి


పాలెం శ్రీ వేంకటేశ్వర దేవాలయం



శ్రీ జున్నా శేఖర్ రెడ్డి, దేవాలయ ఛైర్మన్


హనుమద్వాహనంపై
శ్రీ స్వామివారు


గరుడవాహనంపై
శ్రీ స్వామివారు


గజవాహనంపై
శ్రీ స్వామివారు


రథోత్సవం

అశ్వవాహనంపై
శ్రీ స్వామివారు





శేష వాహనంపై
శ్రీ స్వామివారు


SRI VENKATESHWARA GOVT. ARTS & SCIENCE COLLEGE
PALEM
LIST OF PRINCIPALS
1 SRI. K.NAGESHWARA RAO, M.Sc., AINP. - 01-06-1963 to 13-3-1981
Taken over by the Govt on 14-03-1981
2 SRI. K.NAGESHWARA RAO, M.Sc., AINP. - 14-03-1981 " 10-2-1982
3 " V.DATHA SHARAN, M.Sc.(FAC) - 11-2-1982 " 9-5-1982
4 " D.VISHWANATHAM, M.Sc. - 10-5-1982 " 2-8-1983
5 " M.RAJAMALLU, M.Sc.,(FAC) - 3-8-1983 " 7-10-1983
6 " Dr.K.SAMPATH NARASIMHA CHARY, M.A., Ph.D. 8-10-1983 " 11-1-1985
7 " Dr.GOPALA KRISHNA RAO, M.A., Ph.D.(FAC) - 12-01-1985 " 10-6-1985
8 " B. DHARMA RAO, M.A., DPA. - 11-06-1985 " 30-9-1986
9 " A. KRISHNA, M.Sc., B.Ed.(FAC) - 1-10-1986 " 28-2-1987
10 Smt KESSIA AARON, M.Sc., B.Ed. - 1-03-1987 " 14-8-1987
11 Sri S. RAMAKRISHNA REDDY, - 15-08-1987 " 26-8-1990
12 " Dr.RAMAKRISHNA SARMA, M.A., Ph.D. - 27-08-1990 " 3-12-1990
13 " Dr. S.R. RAGHAVA RAO, M.Sc., Ph.D.(FAC) - 4-12-1990 " 12-9-1991
14 " Dr. V.R. THULASI REDDY, M.Sc., Ph.D. - 13-09-1991 " 23-6-1995
15 " Dr. GOPALA KRISHNA RAO, M.A., Ph.D. - 24-06-1995 " 25-6-1996
16 " Dr. T. NAGENDER, 26-06-1996 " 17-5-2000
17 " Dr. GOPALA KRISHNA RAO, M.A., Ph.D.(FAC) - 18-05-2000 " 26-6-2001
18 " D. VENU GOPAL, M.Sc. - 27-06-2001 " 2-9-2004
19 " Dr. S.KRISHNAIAH, M.Sc., Ph.D.(FAC) - 3-09-2004 " 21-04-2007
20 " CHERI BOB, M.A - 22-04-2007 " 30-4-2009
21 " Dr. S.KRISHNAIAH, M.Sc., Ph.D.(FAC) - 01-05-2009 " 7-12-2009
22 " B. PRATHAP REDDY, M.A. 08-12-2009 " 31-5-2011
23 " Dr.P. PULLA REDDY, M.Sc., Ph.D.(FAC) 01-06-2011 " 31-5-2012
24 " Dr.M.MAHANTHAIAH, M.A., M.Phil, Ph.D (FAC) 01-06-2012 " 12-7-2012
25 " SRI.RH. ARTHUR, M.Sc. (FAC) 22-08-2012 " 23-9-2012
26 " Dr.DSR.RAJENDER SINGH, M.Sc., Ph.D. 24-09-2012 " 01-06-2014
TELANGANA STATE
1. DR. DSR. RAJENDER SINGH, M.Sc., Ph.D. - 02-06-2014
2. A. SHIVALEELA, M.SC., M.PHIL (FAC) 01.07.2016 - 14.04.2022.
3. MRS. S.VIDYA RANI, M.SC.,B.ED.,SET,(PHD) (FAC) 15.04.2022 -



కృతికర్త	:	**గోవిందు గోవర్ధన్**
జననం	:	15-6-1969
పితరులు	:	శ్రీ గోవిందు సాయిలు, శ్రీమతి నారమ్మ
స్వగ్రామం	:	పాలెం
విద్య	:	ఎం. ఏ, టిపిటి
వృత్తి	:	అధ్యాపకత్వం యం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్

గురువులు	:	శ్రీమతి ములుకుట్ల సరస్వతమ్మ శ్రీ రామకృష్ణ శాస్త్రులు డా. శ్రీరంగాచార్యులు డా. గోపాలకృష్ణారావు డా. పి. బాలభాస్కర్
పద్య గురువు	:	డా. వెలుదండ సత్యనారాయణ
అభిరుచులు	:	ఆధ్యాత్మిక చింతన, పద్య రచన
రచనలు	:	పాలెం వేంకటేశ శతకము పాలెం ప్రసన్నాంజనేయ శతకము అష్టోత్తర శత కరోనా శతకము బిజినేపల్లి వేంకటేశ శతకము కందమకరందాలు-సప్తశతి (అముద్రితము)



మా పితరులు
శ్రీ గోవిందు సాయిలు, శ్రీమతి నారమ్మ

